

జూన్ 6 నుంచి డీఎస్సీ రాత పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో ఏడు కేంద్రాలు....32 వేల మంది అభ్యర్థులు

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం జూన్ ఆరో తేదీ నుంచి డీఎస్సీ రాత పరీక్షలు నిర్వహించనున్నారు. పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న ఈ పరీక్షలకు ఏడు కేంద్రాలు ఏర్పాటుచేశారు.ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు జరుగుతాయి. మొత్తం 32 వేల మంది హాజరుకానున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1,139 పోస్టులు భర్తీచేయనున్నారు. పరీక్షలకు విద్యా శాఖ అన్ని ఏర్పాట్లుచేసింది.

ఉక్కు లాభాల బాట

ఏప్రిల్ నెలలో రూ.78 కోట్లు..

- మే నెలలో కాంట్రాక్టు కార్మికుల సమ్మె ఎఫెక్ట్
- పనులు చేయకుండానే జీతాలు తీసుకుంటున్న 1,800 మందిని తొలగించాం
- మరో ఐదు వేల మంది అదనంగా ఉన్నారు
- 'ఆర్' కార్డుదారులకు ఎటువంటి నష్టం జరగకుండా చూస్తున్నాం
- సీఎంకు వివరించిన యాజమాన్యం
- నిర్వాసితులకు అన్యాయం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశం



- ప్లాంటు సక్రమంగా నడిచేలా పర్యవేక్షించే బాధ్యత ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులకు అప్పగింత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్ ప్లాంటు కష్టకాలంలోను రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లతో ఏప్రిల్‌లో రూ.78 కోట్ల లాభాన్ని ఆర్జించింది. మే నెలలో కూడా లాభాలు ఆర్జించే అవకాశం ఉన్నప్పటికీ...నెలాఖరున కాంట్రాక్టు కార్మికులు సమ్మెకు దిగడంతో దాని ప్రభావం కొంత పడిందని యాజమాన్యం చెబుతోంది. ఇటీవల కాంట్రాక్టు కార్మికులు వరుసగా రెండు రోజుల పాటు అడ్మిన్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. మహానాడు కోసం కడపలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయం తెలుసుకొని జిల్లా కలెక్టర్ ద్వారా స్టీల్ ప్లాంటులో ఏమి జరుగుతున్నదో తెలుసుకున్నారు. ఆ తరువాత సీఎండీ, ఇతర అధికారులు ఇక్కడి నుంచి కడప వెళ్లి ప్లాంటులో కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలను వివరించారు.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీ, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లులు, నీటి పన్ను, ఆస్తి పన్ను తదితరాలు మినహాయింపు ద్వారా చేసిన రూ.2 వేల కోట్ల సాయంతో ప్లాంటును లాభాల బాటలోకి తీసుకువచ్చామని వారు వివరించారు. అవసరానికి మించి కాంట్రాక్టు కార్మికులు ఉన్నారని, వారి సంఖ్య తగ్గిస్తేనే ప్లాంటుకు లాభాలు వస్తాయని గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పినట్టు తెలిసింది. ఈ క్రమంలో స్టీల్‌ప్లాంటు కోసం తమ నివాస స్థలాలను ఇచ్చి నిర్వాసితులుగా మారిన 'ఆర్' కార్డుదారులకు ఎటువంటి నష్టం జరగకుండా చూస్తున్నామని వివరించారు. ప్లాంటులో వివిధ యూనియన్లు సమాంతర వ్యవస్థలు ఏర్పాటు చేసుకొని అవసరం లేకపోయినా కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను పెంచుకుంటూ పోయాయని, వారిలో 1,800 మంది కార్మికులు అసలు పనులు చేయకుండానే జీతాలు తీసుకుంటున్నారని, అందుకే వారిని తొలి దశలో తొలగించామని వివరించారు. మరో 300 మందికి 'యు' కార్డులు ఉన్నాయని, వారు సంఘాల నాయకులుగా చలామణి అవుతూ ఎటువంటి విధులు నిర్వహించకుండానే జీతాలు పొందుతున్నారని, దాంతో వారి కార్డులు కూడా నిలిపివేశామని సీఎంకు చెప్పారు. ఇంకా అదనంగా ఐదు వేల మంది కార్మికులు ఉన్నారని, వారిని కూడా దశల వారీగా తొలగిస్తే అదనపు వ్యయాలు తగ్గి ప్లాంటుకు లాభాలు వస్తాయన్నారు. ప్లాంటులో ఉత్పత్తి పెంచి తద్వారా వచ్చిన ఆదాయంతోనే ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని సీఎంకు కర్మాగారం అధికారులు తెలిపారు. కేంద్రం రూ.11,440 కోట్లు ఇచ్చినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోవడానికి కారణం అదేనన్నారు. ఇలా సాయంగా వచ్చిన నిధులు జీతాలకు ఖర్చు చేసుకుంటూపోతే ప్లాంటు ఎన్నటికీ కష్టాల నుంచి బయటపడదని, అందుకే 'పనిచేస్తేనే జీతాలు' అనే విధానంతో ముందుకువెళుతున్నామని పేర్కొన్నారు.

సమ్మె చేస్తున్నది ఎవరు?

కాంట్రాక్టు కార్మికులను తొలగించడం అన్యాయం అంటూ కొందరు ఈ నెల 20వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నారని, వారంతా పనిచేయకుండా జీతాలు తీసుకున్నవారని, అందుకే వారికి కష్టంగా ఉంటోందని అధికారులు చెప్పినట్టు తెలిసింది. డ్యూటీ ప్రకారం పనిచేస్తున్న వారంతా విధులకు హాజరవుతున్నారని, సమ్మెలో పాల్గొనడానికి ఎవరూ లేకపోవడంతో కొన్ని సంఘాలు పారిశుధ్య కార్మికులను తీసుకువచ్చి ఆందోళన చేయిస్తున్నాయని, వారి ఆందోళనలో అర్థం లేదని చెప్పినట్టు తెలిసింది.

నిర్వాసితులకు నష్టం తేవద్దు

నష్టాల్లో ఉన్న స్టీల్ ప్లాంటును లాభాల బాటలోకి తేవడానికి ఢిల్లీలో అనేక ప్రయత్నాలు చేసిన మీదట ఆ సాయం అందిందని, అది దుర్వినియోగం కాకూడదని, అదే ... మిగతా 6వ పేజీలో

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

కానిస్టేబుళ్ల ఎంపికకు నేడు మెయిన్స్ పరీక్ష

- జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 12,491 మంది అభ్యర్థులు హాజరు
- గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని సూచించిన అధికారులు



విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఆదివారం మెయిన్స్ పరీక్ష జరగనున్నది. ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయ నగరం జిల్లాలకు చెందిన 12,491 మంది నగరంలో పరీక్ష రాయనున్నారు. వారికోసం 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆయన ఆదేశాలతో డీసీపీలు అజితా వేజెండ్ల, డి.మేరీ ప్రశాంతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం 2022 నవంబరులో నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అనేక కారణాల వల్ల నియామక ప్రక్రియలో జాప్యం జరిగింది. 2023 జనవరి 22న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించగా, రాష్ట్రం మొత్తమ్మీద సుమారు ఐదు లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 95 వేల మంది అర్హత సాధించారు. వారికి శారీరక, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి 38,910 మందిని ఎంపిక చేశారు. వారికి ఆదివారం మెయిన్స్ నిర్వహించబోతున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన 12,491 మంది ఆదివారం మెయిన్స్ పరీక్షకు హాజరుకానున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

మెయిన్స్ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్నది. అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 9 గంటల నుంచే అనుమతిస్తారు. పది గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలకు అనుమతించరు. అభ్యర్థులు హాల్ టికెట్‌తోపాటు ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకువెళ్లాలి. హాల్ టికెట్‌తోపాటు బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ను మాత్రమే తీసుకువెళ్లాల్సి ... మిగతా 6వ పేజీలో

బదిలీల హడావిడి

రెండో తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాలు

- సిటీ, పరిసర ప్రాంతాలు, అనకాపల్లి చుట్టుపక్కల మండలాల్లో పోస్టింగ్ కోసం పలువురు తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్ల యత్నం
- సిఫారసు లేఖల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు



- స్వయంగా ఫోన్లు చేయిస్తున్న మరికొందరు...
- ఇంచుమించు అన్ని శాఖల్లోనూ అదే పరిస్థితి
- ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన వారికి స్థాన చలనం తప్పనిసరి
- హౌసింగ్‌లో బదిలీలకు జాబితా సిద్ధం


విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో బదిలీల హడావిడి మొదలైంది. జూన్ రెండో తేదీ నాటికి అంటే సోమవారం సాయంత్రంలోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. దీంతో అన్ని శాఖల్లో బదిలీ అయ్యే ఉద్యోగులతో కూడిన జాబితాలు సిద్ధమయ్యాయి. కొన్ని శాఖల్లో సోమవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కోరుకున్న చోట పోస్టింగ్ కోసం అధికారులు, ఉద్యోగులు కొందరు కూటమి పార్టీ ప్రజా ప్రతినిధులు, నేతల నుంచి సిఫారసు లేఖలు తీసుకుని సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు అందజేస్తున్నారు. మరికొందరు స్వయంగా ఫోన్‌లు చేయించుకుంటున్నారు. బదిలీల మార్గదర్శకాల మేరకు ఒకేచోట ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులను విధిగా వేరొక చోటకు పంపాలి. స్పౌజ్, సంఘ నేతలను కొన్ని షరతుల మేరకు బదిలీల నుంచి మినహాయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు బదిలీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కీలకమైన రెవెన్యూలో బదిలీల కోసం జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. రెండు రోజుల క్రితం మూడు జిల్లాల కలెక్టర్లు విశాఖలో సమావేశమై బదిలీలపై చర్చించారు. ఈలోగా పలువురు తహశీల్దార్లు, ఉద్యోగులు తమకు తెలిసిన ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు సంపాదించి జిల్లా యంత్రాంగానికి అందజేశారు. ప్రధానంగా తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ కేడర్ అధికారులు బాగా ఆదాయం వచ్చే మండలాలు/నగరం, అనకాపల్లికి దగ్గర మండలాల్లో పోస్టింగ్స్ కోసం యత్నిస్తున్నారు. ఐదేళ్లకు మించి ఒకేచోట పనిచేసిన వారు కూడా తమను కదిలించవద్దంటూ లేఖలు అందజేస్తున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఐదుగురు తహశీల్దార్లు మూడు నుంచి ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేశారు. నిబంధనల మేరకు వారికి మైదానంలో అనకాపల్లి/విశాఖ జిల్లాల్లో పోస్టింగ్ ఇవ్వాలి. దీంతో నగరం నుంచి పలువురు తహశీల్దార్లకు స్థానచలనం తప్పనిసరిగా చెబుతున్నారు. ఆరోపణలు ఎక్కువగా ఉన్నవారితోపాటు పనితీరు పేలవంగా ఉన్న తహశీల్దార్లను పొరుగు జిల్లాలకు పంపాలని విశాఖ జిల్లా అధికారులు భావిస్తున్నట్టు ... మిగతా 6వ పేజీలో

ఎయిడెడ్ అధ్యాపకులు వెనక్కి...

38 మందిని రిలీవ్ చేస్తూ ఏయూ వీసీ ఆదేశాలు

- గత వీసీ ప్రసాదరెడ్డి హయాంలో నియామకం
- మొదటినుంచి వ్యతిరేకిస్తూ వచ్చిన వర్సిటీ ప్రొఫెసర్లు
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ పెద్దల దృష్టికి...
- విభాగాల అధిపతులు, ప్రిన్సిపాల్స్, సీనియర్ ప్రొఫెసర్ల అభిప్రాయం మేరకు తాజాగా నిర్ణయం



విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఎయిడెడ్ అధ్యాపకులను ఎట్టకేలకు వెనక్కి పంపాలని ఏయూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వైస్ చాన్సలర్ రాజశేఖర్ శనివారం ఆదేశాలు జారీచేశారు.

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఎయిడెడ్ కళాశాలల నుంచి పలువురు అధ్యాపకులను మాజీ వీసీ ప్రసాదరెడ్డి ఏయూలో చేర్చుకున్నారు. ఈ విషయమై వివిధ విభా గాలకు చెందిన సీనియర్ ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ విద్యార్థులకు ఎయిడెడ్ అధ్యాపకులతో పాఠాలు ఎలా చెప్పిస్తారంటూ ప్రశ్నిస్తూ వచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా తీసుకు వచ్చారంటూ ఫిర్యాదులు చేశారు. ఎయిడెడ్ అధ్యా పకులను వెనక్కి పంపించాలంటూ పెద్దఎత్తున నిరసనలు కూడా చేపట్టారు. అయితే, గత వీసీ ప్రసాదరెడ్డి అవేమీ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత పలువురు ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి నారా లోకేష్‌ను కలిసి సమస్యను తెలియజేశారు. వర్సిటీలో ఎయిడెడ్ అధ్యాపకులను కొనసాగించడంపై విమర్శలు వస్తుండడంతో వీసీ జీపీ రాజశేఖర్ కొద్దిరోజుల కిందట అన్ని విభాగాలకు చెందిన అధిపతులు, ప్రిన్సిపాల్స్, సీనియర్ ప్రొఫెసర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎయిడెడ్ అధ్యాపకులను కొన సాగించాలా?, వద్దా.? అన్న అంశంపై వారి అభిప్రాయాలను స్వీకరించారు. అందరూ ముక్తకంఠంతో వెనక్కి పంపించాలని స్పష్టం చేశారు. ఈమేరకు ... మిగతా 6వ పేజీలో

ప్రమాదాలకు హైవే

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

- జాతీయ రహదారిపైనే ట్రావెల్స్ బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాలు నిలిపివేత
- ఆ కారణంగానే తరచూ ప్రమాదాలు
- వారం వ్యవధిలో ముగ్గురి మృతి
- అయినా పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



గురుద్వారా నుంచి సత్యం జంక్షన్ వైపు వెళ్లే జాతీయ రహదారిపై నిలిపిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర పరిధిలోని చాలా ప్రాంతాల్లో జాతీయ రహదారి పార్కింగ్ స్థలంగా మారిపోయింది. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, లారీలతో పాటు నగరవాసులకు చెందిన కార్లు, ఇతర వాహనాలను సైతం హైవేపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరచూ హైవేపై రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువాత పడుతున్నారు.

నగరం మధ్య నుంచి వెళుతున్న జాతీయ రహదారిపై నిరంతరం అనేక రకాల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.



గురుద్వారా వద్ద జాతీయ రహదారిపై నిలిపిన మినీ వ్యాన్‌లు, కార్లు

వాహనాల రద్దీ కారణంగా ఎక్కడో ఒకచోట ట్రాఫిక్ జామ్ అవుతుంటుంది. ప్రధానంగా హనుమంతవాక కూడలి నుంచి అక్కయ్యపాలెం జంక్షన్ వరకూ అయితే వాహనాల రద్దీ మరింత అధికంగా ఉంటుంది. అంతటి రద్దీగా ఉండే జాతీయ రహదారిని కొందరు వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలంగా భావిస్తున్నారు. మద్దిలపాలెం జంక్షన్ నుంచి గురుద్వారా వరకూ ఉదయం ఎనిమిది గంటల సమయంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డుపైనే బస్సులను, సీట్ కవర్లను ... మిగతా 6వ పేజీలో



మర్రిపాలెం గోదాములో తూనిక యంత్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌వో, పరిశీలకుడు

నేటి నుంచి డిపోల వద్ద సరకులు

- ప్రజా ప్రతినిధులతో పంపిణీకి సన్నాహాలు

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): బియ్యం కార్డుదారులకు రేషన్ డిపోల వద్ద సరకులు పంపిణీ ఆదివారం ప్రారంభించనున్నారు. జిల్లాలో గల 642 డిపోల పరిధిలో సరకులు పంపిణీ చేసేలా పౌర సరఫరాల శాఖ ఏర్పాట్లుచేసింది. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటలు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ సరకులు పంపిణీ చేయాలని ఇప్పటికే డీలర్లకు అధికారులు ఆదేశాలు జారీచేశారు. ప్రతి డిపోలో ఈ-పోష్ మిషన్, తూకం యంత్రం సిద్ధం చేశారు. ప్రతి డిపో బయట ఏర్పాటుచేసిన బోర్డుపై డీలరు పేరు, నంబరు, ఏరియా, స్టాకు వివరాలు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్, జిల్లా పరిశీలకుడు భగన్నారాయణ శనివారం మర్రిపాలెం గోదామును సందర్శించి అక్కడ స్టాకు వివరాలు పరిశీలించారు. గోదాములో తూకం యంత్రం పనితీరును చూసి సూచనలు చేశారు. కాగా ఆదివారం బియ్యం కార్డుదారులకు సరకులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులకు ఆహ్వానించారు. ఉదయమే ప్రజా ప్రతినిధులు డిపోలకు సందర్శించి సరకులు పంపిణీ చేసేలా ఏర్పాట్లుచేశారు.

తీరం...ప్లాస్టిక్ వ్యర్థాల మయం



నగరం నుంచి మురుగు కాల్వలు, గెడ్డల ద్వారా సముద్రంలోకి పెద్దఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలు చేరుతున్నాయి. ఇవి సముద్రంలో జీవించే అనేక జీవరాశుల మనుగడకు ముప్పుగా పరిణమిస్తున్నాయి. శనివారం పెదవాల్తేరు ఆర్టీసీ బస్ డిపో వెనుక ఉన్న జాలరిపేట వద్ద తీరం ప్లాస్టిక్ వ్యర్థాలతోపాటు చెత్తా చెదారంతో అధ్వానంగా కనిపించింది. శుక్రవారం వర్షం నీటితో సముద్రంలోకి చేరిన ప్లాస్టిక్ వ్యర్థాల్లో కొన్ని అలల తాకిడికి ఇలా ఒడ్డుకు చేరాయి.

- విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి


రక్షణ గోడలు లేకుండా ఉన్న కల్వర్టు

ప్రమాదకరంగా కల్వర్టు

పద్మనాభం రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామ సమీపంలో ఉన్న పల్లి గెడ్డ కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పద్మనాభం - శొంఠ్యాం రహదారిలో ఈ కల్వర్టు ఉంది. పద్మనాభం నుంచి మద్ది, నీళ్లకుండీలు శొంఠ్యాం మీదుగా సింహాచలం, గోపాలపట్నం, గాజువాక వెళ్లే వారు ఈ కల్వర్టు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో వారంతా తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

3న వైసీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

తగరపువలస, మే 31 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ భీమిలి నియోజకవర్గ స్థాయి సమావేశం ఈనెల 3న తగరపువలసలోని బైపాస్ రోడ్డులో ఉన్న ఫంక్షన్ హాలులో జరగనున్నట్టు పార్టీ నాయకులు తెలిపారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ సమావేశానికి అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు.

కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన

మధురవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని చంద్రంపాలెం ఎన్‌జీఓ కాలనీ సమీపంలో కల్యాణ మండపం నిర్మాణానికి కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రంపాలెంలో ఏ శుభకార్యం జరిగినా కల్యాణ మండపం లేకపోవడంతో ప్రజలు ఇళ్ల వద్ద నిర్వహించుకోవాల్సి వస్తుందని, ఈనేపథ్యంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు కల్యాణ మండపం నిర్మించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, వార్డు అధ్యక్షుడు పిళ్లా నరసింగరావు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సినీ నటుడు కృష్ణ జయంతి

తగరపువలస, మే 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని జీరుపేటలో సినీ నటుడు కృష్ణ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అభిమానులు కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

ఆర్‌హెచ్ కాలనీలో టీడీపీ నాయకుల పర్యటన

కొమ్మాది, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా పాకలు వేసుకుని జీవిస్తున్న తమకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని ఆరో వార్డు ఆర్‌హెచ్ కాలనీ ప్రజలు టీడీపీ నాయకులను కోరారు.శనివారం వారు కాలనీలో పర్యటించి, స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్,జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్, బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

కొమ్మాది, మే 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఐదో వార్డు పరిధిలోని సద్గురుసాయినాథ్ కాలనీ, బొట్టవానిపాలెం ప్రాంతాల్లో కార్పొరేటర్ మొల్లి హేమలత శనివారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ కార్యదర్శులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సింహాచలం : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు, టీడీపీ యువనేత రవితేజ శనివారం 98వ వార్డులోని పాత అడివివరంలో సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పివి నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

చెత్త ట్రక్‌లో పాము కలకలం



ట్రక్ క్యాబిన్ నుంచి తీసిన పాము

విశాలాక్షినగర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : విశాలాక్షినగర్‌లో చెత్త తరలించే జీవీఎంసీ ట్రక్‌లో పాము కలకలం సృష్టించింది. విశాలాక్షినగర్, దయాల్‌నగర్‌లో ఉన్న చెత్తను పారిశుధ్య సిబ్బంది శనివారం ఉదయం ట్రక్‌లోకి వేశారు. అక్కడ నుంచి వాహనం బయలుదేరిన కొద్ది సేపటికే ట్రక్ క్యాబిన్‌లో పాము కనిపించింది. డ్రైవర్ ట్రక్‌ను రోడ్డు పక్కన నిలిపివేసి, కిందకు వచ్చేశాడు. విషయాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావుకు చెప్పడంతో ఆయన స్నేక్ క్యాచర్‌కు తెలియజేశారు. అతను పామును బయటకు తీసి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.


శిక్షణలో భాగంగా యుద్ధ పరికరాల గురించి అవగాహన


తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు

ఉత్సాహంగా ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ శిబిరం

- ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి 610 మంది హాజరు
- నేటితో ముగియనున్న తరగతులు

సాగర్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్‌లో 13వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల్లోని ఎన్‌సీసీ క్యాడెట్లకు పది రోజులుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదివారంతో ఈ తరగతులు ముగియనున్నాయి. ఈ శిబిరంలో సుమారు 610 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. 25 అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఎన్‌సీసీ అంటే యువతను క్రమశిక్షణతో దేశభక్తి గల పౌరులుగా తీర్చిదిద్దడానికి ఏర్పాటు చేసిన సంస్థ. సైనిక. నౌకాదళం, వైమానిక విభాగాన్ని కలిగి ఉన్న సంస్థ. భారత సాయుధ దళాల యువజన విభాగం, నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌గా పేర్కొంటారు. ఎల్‌టీకల్నల్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిం నేతృత్వంలో క్యాడెట్లకు ఆయుధాలతో ఫైరింగ్, శత్రువులను ఎదుర్కోవడం, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్‌లో సెక్షన్ ఫార్మేషన్స్, గార్డ్ ఆఫ్ హానర్, రిపబ్లిక్ డే క్యాంపు, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అలాగే సర్వీస్‌సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ)కి క్యాడెట్స్‌ను సిద్ధం చేయడం కోసం పరీక్షకు ఎలా సిద్ధం కావాలన్నది కూడా అవగాహన కల్పించారు. అగ్నివీర్ సెలక్షన్స్, సీ హారియర్ మ్యూజియంకి తీసుకువెళ్లి అక్కడ ఉన్న ఎయిర్ క్రాఫ్ట్ పార్ట్స్, జెట్ ఇంజన్లు, మి స్సైల్స్ వాటి పని విధానం, ఏ సమయంలో వాటిని ఎలా వినియోగిస్తారన్నది కూడా వివరించారు. సబ్ మెరైన్ లోపలికి తీసుకువెళ్లి అది పనిచేసే విధానం అందులో వినియోగించే ఆయుధాలపై తెలిపారు. వీటితో పాటు సామాజిక అంశాల మీద, సమాజానికి సేవ గురించి చెప్పారు.

బీచ్ రోడ్డులో తిరంగా ర్యాలీ

శిక్షణలో భాగంగా కళాశాల నుంచి రుషికొండ బీచ్ వరకు శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్ ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం పుర స్కరించుకుని 300 మీటర్ల జాతీయ పతాకంతో ఈ ర్యాలీ సాగించారు. ఈ కార్యక్రమంలో సుబేదర్ మేజర్ శ్రీనివాస్, కెప్టెన్ భాస్కర్ అనంత్, ఫస్ట్ ఆఫీసర్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


సన్మాన గ్రహీతులతో ఆలయ ఉద్యోగులు

అప్పన్నకు సేవ పూర్వ జన్మ సుకృతం

సింహాచలం, మే 31 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి సేవ చేసే అవకాశం లభించడం తన పూర్వజన్మ సుకృతమని దేవస్థానం ఏఈఓ నక్కాన ఆనందకుమార్ అన్నారు. దేవస్థానంలో డిప్యూటీ ఈఈగా 40 ఏళ్లు సేవలందించిన జీవీవీ నాగేశ్వరరావు, కొత్వాల్ నాయకుడిగా 30 ఏళ్లు సేవలందించిన నక్క సత్యారావు శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఈఓ మాట్లాడుతూ భగవంతుడికి, భక్తులకు సేవ చేసే భాగ్యం కలగడం ఉద్యోగుల అదృష్టమన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన వారిని వాయిద్యాల నడుమ ఆహ్వానించి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకుడు రామారాజు, ఏఈఓ పిళ్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరా ఉండని ప్రాంతాలు

కొమ్మాది, మే 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-2 పరిధిలోని 6, 7వ వార్డులకు సోమవారం తాగునీటి సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు తాగునీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 6, 7 వార్డులకు తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ మారికవలస ఎమ్మార్ఎఫ్ టైర్స్ షోరూమ్ వద్ద లీక్ కావడంతో మరమ్మతు పనుల దృష్ట్యా నీటి సరఫరాను నిలుపుదల చేస్తున్నామని చెప్పారు. 6వ వార్డులోని కొమ్మాది, ఎంఎస్ఆర్ లేఅవుట్, సాయిప్రియా లేఅవుట్, సంపత్‌నగర్, లక్ష్మీవానిపాలెం, బక్కన్నపాలెం, పీఎంపాలెం, అశోక్‌నగర్, 7వ వార్డులోని చంద్రంపాలెం, కళానగర్, కృష్ణనగర్, ఎన్‌జీ ఓఎస్ కాలనీ, వుడాకాలనీ ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు.

పునర్నిర్మించిన భవనాలు ప్రారంభం


భవనాలను ప్రారంభిస్తున్న కమాండెంట్ మురళీ కృష్ణ

కొమ్మాది, మే 31 (ఆంధ్రజ్యోతి) : బెటాలియన్ సిబ్బంది ఉన్నతికి ట్రైనింగ్, గ్రంథాలయ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని కమాండెంట్ మురళీ కృష్ణ అన్నారు. శనివారం ఆయన బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో పునర్నిర్మించిన ట్రైనింగ్ క్లాస్‌రూమ్, గ్రంథాలయం, అసోసియేషన్ గదులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం 1వపోలీస్ బెటాలియన్ కమాండెంట్ పద్మనాభరాజు, అధికారులు సత్యం, వి. నారాయణరావు, ఎన్. మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్తెమ్మ తల్లి పండగ

సింహాచలం, మే 31 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సోదరి సత్తెమ్మ తల్లి వార్షిక పండగ ఆదివారం జరగనున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి. వెంకటరావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు

సీతంపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో సెల్‌ఫోన్లు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసి 12 సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏడీసీపీ (క్రైం) మోహన్‌రావు తెలిపారు. ద్వారకానగర్‌లోని శ్రీచక్ర బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న గణేష్ అనే వ్యక్తి ఏప్రిల్ 7న నిర్వాహకుడు సోమిరెడ్డికి ఫోను చేసి సెల్‌ఫోను కనిపించలేదని తెలిపాడు. హాస్టల్‌లో మరో ఆరుగురు కూడా తమ సెల్‌ఫోన్లు మాయమైనట్లు చెప్పారు. అదే భవనంలో గల మరో హాస్టల్‌లోనూ అయిదు సెల్‌ఫోన్లు చోరీ అయినట్లు తెలుసుకున్నారు. దీంతో సోమిరెడ్డి ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైం సీఐ వి.చక్రధర్‌రావు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీల ఆధారంతో నిందితుడ్ని గుర్తించారు. విజయనగరం జిల్లా గుర్ల మండలం గూడెం గ్రామానికి చెందిన కనకం దామోదరరావు ఎలియాస్ కార్తీక్, ఎలియాస్ దాము, ఎలియాస్ రోహిత్ (26) వీటిని చోరీ చేసినట్లు తేలింది. అతడు సెల్‌ఫోన్లు విక్రయించడానికి వెళ్తున్న సమయంలో చాకచక్యంగా పట్టుకున్నారు. వివిధ పోలీసు స్టేషన్లలో 20 వరకు సెల్‌ఫోన్లు అపహరించినట్లు కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్ఐ ఎస్.రాజు పర్యవేక్షణలో దామోదర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకున్న సీఐ వి.చక్రధర్‌రావు, ఎస్ఐ రాజు, కానిస్టేబుళ్లు వి.అప్పలరాజు, ఎస్.హరిప్రసాద్, ఎన్.జగత్ కిరణ్‌లను పోలీసు అధికారులు ప్రశంసించారు.

యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానాలు చేస్తూ ప్రమాదానికి గురైన యువకుడ్ని లైఫ్‌గార్డులు శనివారం రక్షించారు. మధురవాడలోని వాంబేకాలనీకి చెందిన నలుగురు యువకులు రుషికొండ బీచ్‌కు విహారానికి వచ్చారు. వారంతా సముద్ర స్నానాలు చేస్తుండగా ఎం. శ్రీకాంత్ (28) కెరటాల ఉధృతికి ప్రమాదానికి గురయ్యాడు. సమీపంలో విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డులు సముద్రంలో దూకి యువకుడ్ని రక్షించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, మే 31 (ఆంధ్ర జ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని పీఎంపాలెం గ్రామానికి చెందిన పి. లక్ష్మీ, పల్లవి రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో ఆలయ ప్రజా సంబంధాల విభాగం పర్యవేక్షణాధికారి పద్మనాభరాజు (విక్రమ్)కు శనివారం అందజేశారు.


నూతన వీధి దీపాలతో బొండా జగన్

వీధి దీపాల సమస్య పరిష్కారం

87వ వార్డులోని వడ్లపూడి, కణితి ప్రాంతాలకు

120 నూతన దీపాలు మంజూరు



కూర్మన్నపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని వడ్లపూడి, కణితిలో వీధి దీపాల సమస్యకు 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంతో పరిష్కారం లభించింది. వార్డులోని పలు కాలనీల్లో వీధి దీపాలు లేక జనం ఇబ్బందిపడేవారు. జనవరి 28న నిర్వహించిన 'అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో కాలనీవాసులు ఈ సమస్యను ప్రస్తావించారు. దీంతో కార్పొరేటర్ బొండా జగన్ వీధి దీపాల సమస్యను మేయర్‌తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో శనివారం 120 నూతన విద్యుత్ దీపాలను మంజూరయ్యాయి. దీంతో తమ సమస్య పరిష్కారమైందని కాలనీలవాసులు ఆనందం వ్యక్తంచేశారు. వీధి దీపాలు ఏర్పాటు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, వర్రె రాంబాబు, డీవీ అప్పారావు, రాజేంద్రప్రసాద్, శ్రీను, నూకరాజు, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ అధ్యాపకులు వెనక్కి

... 5వ పేజీ తరువాయి

వారిని రిలీవ్ చేస్తూ వీసీ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

మిగిలిన 38 మంది

రాష్ట్రంలోని ఎయిడెడ్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులను 2021లో ఏయూలో చేర్చుకునేందుకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ ఉత్తర్వులు రావడానికి అప్పటి వీసీ ప్రసాదరెడ్డి కీలకంగా వ్యవహరించారు. తొలుత 113 మంది చేరేందుకు సుముఖత వ్యక్తంచేశారు. అయితే, అనేక కారణాల వల్ల 83 మంది మాత్రమే చేరారు. వారు చేరినప్పటి నుంచి వర్సిటీ వర్గాలు తీవ్రంగా వ్యతి రేకించడంతో కొద్దిరోజుల్లోనే 43 మంది వెనక్కి వెళ్లిపోయారు. మరో 40 మందిలో ఒకరు చనిపోగా, మరొకరు కొద్దిరోజుల కిందట వర్సిటీ నుంచి వెనక్కి వెళ్లిపోయారు. మిగిలిన 38 మందిని తాజాగా వర్సిటీ అధికారులు రిలీవ్ చేశారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

... 5వ పేజీ తరువాయి

ఉంటుంది. అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయనున్నారు. సెల్‌ఫోన్లు, ఎల్రక్టానిక్ వాచ్‌లు, ఇతర గాడ్జెట్లను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్లు పరిధిలో జెరాక్స్, కంప్యూటర్ కేంద్రాలను మూసియాలని ఇప్పటికే పోలీసు అధికారులు ఆదేశించారు.

ఉక్కు లాభాల బాట

... 5వ పేజీ తరువాయి

సమయంలో కార్మికులలో అసంతృప్తి పెరగకుండా, భూములు ఇచ్చిన నిర్వాసితులకు అన్యాయం జరగకుండా చూడాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించినట్టు తెలిసింది. స్టీల్‌ప్లాంటు సక్రమంగా నడిచేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులకు అప్పగించినట్టు సమాచారం. స్టీల్ యాజమాన్యంతో సమన్వయం చేసుకుంటూ ఉత్పత్తి పెరిగేలా, తద్వారా లాభాలు వచ్చేలా చూడాలని చెప్పినట్టు తెలిసింది.


పూడికతీత జరుగుతున్న మద్ది గ్రామంలోని దివాన్‌జీ కాలువ

శరవేగంగా దివాన్‌జీ కాలువ పూడికతీత

పద్మనాభం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామంలో దివాన్‌జీ కాలువ పూడికతీత శరవేగంగా జరుగుతోంది. గ్రామంలోని గోస్తనీ నది ఆనకట్ట నుంచి తాటితూరు పెద చెరువు వరకు విస్తరించి ఉన్న ఈ కాలువలో తూగికాడ, తుప్పలు, డొంకలు తొలగింపుతో పాటు పూడిక తీగిస్తున్నారు. ఈ కాలువ ద్వారా 1158 ఎకరాలకు సాగునీరు అందుతోంది. మద్ది గోస్తనీ నదిపై ఉన్న ఆనకట్ట నుంచి పాండంగ్రి వద్ద ఉన్న డివిజన్ డ్యామ్ వరకు ఈ కాలువ విస్తరించి ఉంది. అక్కడి నుంచి రెండుగా విడిపోయి ఒకటి పాండ్రంగి చిరత చెరువులోకి, మరొకటి తాటితూరు పెద చెరువులోకి కలుస్తుంది. ఖరీఫ్ నాటికి సాగునీరు అందేలా కూటమి ప్రభుత్వం కాలువ మరమ్మతులు, నిర్వహణ కోసం రూ.7 లక్షలు నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో కాలువ పూడికతీత జోరుగా సాగుతోంది.

బొప్పరాజును విమర్శించే స్థాయి భూపతిరాజుకు లేదు

రాష్ట్ర వీఆర్వో సంఘం అధ్యక్షుడు ఆంజనేయకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వీఆర్వోల సంఘం అధ్యక్షుడు కె.ఆంజనేయకుమార్

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ చైర్మన్, రాష్ట్ర రెవెన్యూ సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లును విమర్శించే స్థాయి గ్రామపాలనాధికారు సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజుకు లేదని రాష్ట్ర వీఆర్వోల సంఘం అధ్యక్షుడు కె.ఆంజనేయ కుమార్ పేర్కొన్నారు. అమరావతి జేఏసీ విశాఖ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డితో కలిసి శనివారం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే ప్రభుత్వ శాఖలు, కార్యదర్శుల స్థాయిలో జేఏసీ భాగస్వామ్య సంఘాలతో బొప్పరాజు సమావేశాలు ఏర్పాటు చేసి త్వరలో ముఖ్యమంత్రితో చర్చించేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. ఒకటో తేదీన జీతాలు పడడంతో ఉద్యోగులు సంతోషంగా ఉన్నారని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, నాలుగు డీఏలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతుంటే భూపతిరాజుకు వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. ఉద్యోగులు, పింఛన్‌దారుల సమస్యలపై బొప్పరాజు ఆధ్వర్యంలో ఏపీజేఏసీ పలు కార్యక్రమాలు చేపడుతుందని, రెవెన్యూమంత్రి, ఉన్నతాధికారులను కలిసి ఎప్పటికప్పుడు సమస్యలు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. బొప్పరాజు, ఇతర నాయకుల చొరవతో అధికారుల స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, త్వరలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలో స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబును కలుస్తామని పేర్కొన్నారు. ఉద్యోగులు, పింఛన్‌దారుల సమస్యలపై బొప్పరాజు నేతృత్వంలో పోరాటం చేస్తుంటే వాస్తవాలు మర్చిపోయి తప్పుడు ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. విలేకరుల సమావేశంలో ఏపీ వీఆర్వో సంఘం కోశాధికారి బి. శ్రీనివాస్, విశాఖ జిల్లా అధ్యక్షుడు వెంకట అప్పారావు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు త్రినాథ్ పాల్గొన్నారు.

ప్రమాదాలకు హైవే

... 5వ పేజీ తరువాయి

శుభ్రం చేసుకుంటుంటా. వీటితోపాటు హైవే పక్కన ఉండే ఇళ్లలో నివాసం ఉండేవారు, కార్యాలయాల్లో పనిచేసేవారు తమ వాహనాలను జాతీయ రహదారిపైనే పార్కింగ్ చేస్తున్నారు. రద్దీ సమయాలతో పాటు రాత్రివేళ జాతీయ రహదారిపై వాహనాల పార్కింగ్ కారణంగా ఆయా మార్గాల్లో ప్రయాణించేవారు ముందు వెళ్లే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. వారం రోజుల వ్యవధిలోనే సత్యం జంక్షన్ నుంచి గురు ద్వారా వచ్చే మార్గంలో ఇద్దరు ద్విచక్ర వాహనదారులు మృతిచెందగా, ఇసుకతోట సిగ్నల్ సమీపంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. గురుద్వారా జంక్షన్ నుంచి హనుమంతవాక కూడలి వరకు జాతీయ రహదారిపై వాహనాల పార్కింగ్ నిత్యకృత్యంగా మారింది. వీటివల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. హైవేపై వాహనాల పార్కింగ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిసినా కూడా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. ట్రావెల్స్ నిర్వాహకులు, ఇతర వాహనాల యజమానులతో పోలీసులు అవగాహన కుదుర్చుకోవడం వల్లే వారు హైవేపై దర్జాగా పార్కింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారిపై పార్కింగ్‌లో ఉన్న వాహనాలను టోయింగ్ వెహికల్స్ ద్వారా స్టేషన్‌కు తరలించడం, అయినప్పటికీ ఎవరైనా పార్కింగ్ చేస్తే వాటికి జరిమానాలు విధించడం వంటి చర్యలు తీసుకుంటే హైవేపై పార్కింగ్‌కు అడ్డుకట్ట పడడంతోపాటు ప్రమాదాలకు కూడా అవకాశం ఉండదని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

బదిలీల హడావిడి

... 5వ పేజీ తరువాయి

రెవెన్యూ వర్గాల్లో వినిపిస్తోంది. తమకు తలనొప్పులు తెచ్చే అధికారులను సాగనంపుతారని జోరుగా ప్రచారం సాగుతుంది. నగరానికి దక్షిణ ప్రాంతంలో పనిచేస్తున్న తహశీల్దారు ఒకరు భీమిలి నియోజకవర్గంలో ఒక మండలానికి వెళ్లేందుకు సిఫారసు లేఖ సంపాదించారని చెబుతున్నారు. ఇదిలావుండగా జల వనరుల శాఖలో గ్రామీణ ప్రాంతంలో ఉన్న కొందరు ఉద్యోగులు నగరానికి రావడానికి ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తీసుకున్నారు. కొందరు ఉద్యోగులు రెండు అంతకంటే ఎక్కువ లేఖలు సమర్పించారు. జిల్లా హౌసింగ్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు, ఇంజనీర్ల బదిలీకి అధికారులు జాబితా సిద్ధం చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యే బంధువునంటూ హల్‌చల్ చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఏఈని కూడా బదిలీ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఖజానా కార్యాలయంలో పరిధిలో బదిలీల నిర్వహణకు అధికారులు కమిటీ వేశారు. అయితే సంఘ నేతలమని కొందరు, ఇతరత్రా కారణాలతో మరికొందరు బదిలీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. పౌరసరఫరాల శాఖలో పలువురు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయాలని అధికారులు నిర్ణయించారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, మే 31 (ఆంధ్ర జ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి శనివారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన చేశారు.తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

ఫుట్‌పాత్‌లా? పార్కింగ్ సెంటర్లా?

» పాదచారులకు తప్పని అవస్థలు » బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు » తరచూ రోడ్డు ప్రమాదాలు

బీచ్ రోడ్డు, మే 31 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులోని పలు ప్రాంతాల్లోని ఫుట్ పాత్‌లు కారు పార్కింగ్‌గా మారిపోతున్నాయి. ముఖ్యంగా ఆర్కే బీచ్, వైఎంసీఏ కూడలికి ఆనుకొని ఉన్న సర్వీస్ రోడ్డులో ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. ఇందులో కార్లను పార్కు చేయడంతో పాటు, దుకాణాలను ఏర్పాటు చేశారు. జీవీఎంసీ అధికారులు ఫుట్‌పాత్‌ల వెడల్పును 10 అడుగులకు పెంచడంతో కార్లను పార్కు చేసుకునేందుకు ఇవి అనువుగా మారాయి. ఈ నేపథ్యంలో బీచ్ రోడ్డులో ఉన్న ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో పాదాచారులు రోడ్లపైన వాహన రాకపోకల మధ్య ప్రమాదకర పరిస్థితుల్లో నడవాల్సి వస్తోంది. కాగా, మరో కొంత మంది ఫుట్‌పాత్‌లపై చిన్న చిన్న దుకాణాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఎవరి అవసరాలకు తగిన విధంగా వారు ఆక్రమణకు తెగబడడంతో ఫుట్‌పాత్‌లు కనిపించకుండా పోయాయి. ఇంత జరుగుతున్నా


ఫుట్‌పాత్‌లపై పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు, కార్లు

జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ సమస్య వల్ల బిజీ సమయాల్లో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్న మవుతున్నాయి. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని బీచ్‌రోడ్డుకు వచ్చే ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించి పాదాచారులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీఐటీయూ మద్దిలపాలెం జోన్ నూతన కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు అప్పలరాజు

మద్దిలపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని సీతారాం ఏచూరి భవన్‌లో శనివారం నిర్వహించిన సీఐటీయూ సమావేశంలో మద్దిలపాలెం జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.అప్పలరాజు, కార్యదర్శి పి.వెంకట్రావు, కోశాధికారిగా ఎంసీహెచ్ అప్పుడు, ఉపాధ్యక్షులుగా పి.రాజ్‌కుమార్, జేఆర్ నాయుడు, సి.నాయుడు, బి.రత్నం, మంగశ్రీ, సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా ఎ.సింహాచలం, కె.కుమారి, రామప్పడు, పార్వతమ్మ, పి.శంకరరావు, వి.కృష్ణారావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాల వల్ల అసంఘటిత కార్మికులకు ఉపాధికి భద్రత లేకుండా పోతోందన్నారు. ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా రూ.12 వేలు వరకు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. అతి తక్కువ వేతనాలు చెల్లించి 12 నుంచి 16 గంటలు పని చేయించుకుంటున్నారని మండిపడ్డారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం కార్మిక సంఘాలను ఐక్యం చేసుకుని పోరాటం చేస్తామన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, మే 31 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఉదంతంపై ఎంవీపీ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.

ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరు గొల్లవీధికి చెందిన మువ్వల అప్పలరాజు (47) మద్యానికి బానిసయ్యాడు. అప్పులతో పాటు క్రెడిట్ కార్డును వినియోగించడం వల్ల బకాయిల ఎక్కువయ్యాయి. సంబంధిత సంస్థల నుంచి ఒత్తిడి రావడంతో గురువారం ఉదయం తన ఇంటిలో ఫోన్‌ను విడిచి పెట్టి, బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య పోలీసులను ఆశ్రయించింది. హెడ్ కానిస్టేబుల్ వరహాలు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీ

వెంకోజీపాలెం/ మద్దిలపాలెం/ రామ్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి) :ఈ నెల 1వ తేదీ ఆదివారం రావడంత రాష్ట ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారమే పింఛనుదారులకు అందజేసింది. జీవీఎంసీ 15, 16 వార్డుల్లో కూటమి పార్టీల నాయకులు ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే 22వ వార్డులో టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందించారు. 28వ వార్డులో టీడీపీ వార్డు ఇన్‌చార్జు నక్కా కనకరాజు, జడ్సీ మల్లయ్య నాయుడు పింఛన్లు అందజేశారు.

సినిమా గైడ్

- **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 18, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 32, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)54, బరబాటి 28, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు40, దోస కాయలు 14, వె ల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీర దోస 28, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికా య 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

క్రీడా రంగంలో విశాఖ ఖ్యాతిని పెంచాలి


భగీరథను సన్మానిస్తున్న విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, పలాస (శ్రీకాకుళం జిల్లా) ఎమ్మెల్యే గౌతు శిరీష తదితరులు

మద్దిలపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) :క్రీడల్లో విశాఖ ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లాలని క్రీడకారులకు ఎమ్మెల్యేపి.గణబాబు పేర్కొన్నారు. పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన డి.భగీరథ, ఐసీఏఐ ఉపాధ్యక్షుడుగా ఎంపికైనా డి.ప్రసన్నకుమార్‌లను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడమే కాకుండా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. యువత విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యం సాధించి ప్రపంచపటంలో విశాఖకు పదిలమైన స్థానం ఏర్పరచాలన్నారు. భగీరథ, ప్రసన్నకుమార్‌లు జాతీయ స్థాయిలో పదవులు పొందడం నగరానికే గర్వకారణమన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పదవులు పొందిన భగీరథ, ప్రసన్నకుమార్‌లు వారి పదవులతో పాటు నగరానికి పేరు తెచ్చేవిధంగా పని చేయాలన్నారు. ఇటువంటి వారిని సన్మానించడం ద్వారా చిన్నారుల్లో స్ఫూర్తిని పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌చంద్ర, కార్యదర్శి శీలం లక్ష్మణ్, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి తామస్ అయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనమైన మేధో వారసత్వం ఏయూ సొంతం : రిజిస్ట్రార్


వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న మేనేజ్‌మెంట్ విద్యార్థులు, అధ్యాపకులు

వెంకోజీపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఘనమైన మేధో వారసత్వాన్ని కలిగి ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అన్నారు. శనివారం ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో నిర్వహించిన ఎంబీఏ లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ఏయూ అత్యుత్తమమైన నాక్ గ్రేడింగ్ కలిగి ఉందని చెప్పారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఏయూ పూర్వ విద్యార్థుల సంఘంలో సభ్యులుగా చేరాలని, ఏయూ ప్రగతిలో తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ డైరెక్టర్ పి.విశ్వనాథం మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం ఏయూ నిర్వహిస్తోందన్నారు. ఈ కోర్సులో చేరిన వారు ఎంతో ఆసక్తితో, ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తూ విజయవంతంగా కోర్సును పూర్తిచేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వృత్తిపరమైన అభివృద్ధికి ఈ కోర్సు ఎంతగానో ఉపయోగిస్తుందన్నారు. కోర్సు పూర్తి చేసిన పలువురు విద్యార్థులు తమ సంతోషాన్ని పంచుకున్నారు కార్యక్రమంలో ఏయూ సిబ్ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణతో శేష జీవితం ఆనందంగా గడపాలి

» పదవీ విరమణ పొందిన జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులకు సన్మాన కార్యక్రమంలో ఏడీసీ రమణమూర్తి


సత్కారం పొందిన పదవీ విరమణ చేసిన జీవీఎంసీ అధికారులు, సిబ్బంది

వెంకోజీపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం ప్రతి ఉద్యోగికి తప్పనిసరని, ఉద్యోగ విరమణ శేష జీవితానికి పునాది వంటిదని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. జీవీఎంసీలో వివిధ హోదాలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందనున్న 12 మంది జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులను శనివారం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎస్వీ నరేష్‌కుమార్, అడ్మినిస్ట్రేషన్ అధికారులు పద్మజ, అప్పలనాయుడుతో కలిసి ఆయన సన్మానించారు.

ఈ సందర్భంగా ఏడీసీ రమణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారు జీవీఎంసీలో సుదీర్ఘకాలం ప్రజల కోసం ఎన్నో సేవలు అందించారని, రోజులో తన కుటుంబం కంటే తమ సంస్థ కోసం అంకితమై సేవలు అందించి, ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఉద్యోగి తమ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించి, వారి విధుల నిర్వహణను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు శివప్రసాదరాజుకు మేయర్ సన్మానం

వెంకోజీపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని, ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితాన్ని ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాదరాజును శనివారం జీవీఎంసీ ప్రధానకార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో పలువురు కార్పొరేటర్లతో కలిసి ఘనంగా మేయర్ సన్మానించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్లు బల్లా శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, శరగడం రాజశేఖర్, గొలగాని వీరారావు, బొండా జగన్నాథం, కొణతాల సుధా, గొలగాని పోలరావు పాల్గొన్నారు.


ఇంజనీరు పి.శివప్రసాదరాజును సన్మానిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు

6, 7 వార్డుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం రేపు

వెంకోజీపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-2లోని 6, 7 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో వచ్చే నెల 2వ తేదీన తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ జోన్-2లోని 6, 7 వార్డుల్లో తాగునీటిని సరఫరా చేయు ప్రధాన వనరు అయిన గోస్తని హెడ్ వాటర్ వర్క్స్ నుంచి తాగునీటిని పంపింగ్ చేయు ప్రధాన 700 ఎం.ఎం.డయా పైపులైన్ మారికవలస ఎంఆర్ఎఫ్ టైర్స్ షోరూం దగ్గర లీకులకు గురికావడంతో మరమత్తులు చేయు నిమిత్తం నీటి పంపింగ్ నిలుపుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. అందువల్ల జూన్ 2న తాగు నీటిని సరఫరా చేయుటకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. జోన్-2లోని వార్డు 6లో కొమ్మాది విలేజ్, ఎంఎస్ఆర్ లే అవుట్, సాయి ప్రియ లే అవుట్, సంపత్‌నగర్, లక్ష్మీవానిపాలెం, ఎస్సీ కాలనీ, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, పీఎం పాలెం, అశోక్ నగర్, తులసి నగర్, 7వ వార్డులో చంద్రం పాలెం, కళానగర్, కృష్ణానగర్, ఎన్జీవోస్ కాలనీ, వుడా కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీట సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కాబట్టి ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ప్రకటనలో కోరారు.

ఫిజిక్స్ లెక్చరర్ రమేశ్‌కు సన్మానం


రమేశ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆరిలోవ, మే 31 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి ఉద్యోగంలో ఒక భాగమని విజయనగరం అంబేద్కర్ గురుకులాల సమన్వయ అధికారి ఎస్.రూపవతి అన్నారు. శ్రీకృష్ణాపురం అంబేద్కర్ గురుకులంలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పని చేసి పలువురి మన్ననలను పొందిన లెక్చరర్ బీకే రమేష్‌ను శనివారం సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణాపురం అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి తదితరులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్లకు సికిల్‌సెల్ అనీమియా

» నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరేళ్ల బాలిక మృతి
» ఆమె సోదరిని కేజీహెచ్‌కు తరలించాలని వైద్యుల సూచన


మృతి చెందిన దవళ యోధశ్రీ (ఫైల్)

కొయ్యూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం చిన్నపాడు పంచాయతీ గోపవరానికి చెందిన ఆరేళ్ల బాలిక శనివారం సాయంత్రం సికిల్‌సెల్ అనీమియాతో మృతిచెందింది. ఆమె సోదరి కూడా ప్రస్తుతం ఆస్పత్రిలో ఉంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దవళ దారబాబు, దేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు భాగ్యశ్రీ (10), యోధశ్రీ (6). ఇద్దరూ సికిల్‌సెల్ అనీమియా వ్యాధితో బాధపడుతున్నారు. భాగ్యశ్రీని రెండు రోజుల క్రితం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం ఉదయం యోధశ్రీని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందింది. కాగా భాగ్యశ్రీని మెరుగైన వైద్య సేవల నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించాలని వైద్యులు సూచించారు.

'కౌన్సిల్ అజెండాలో ముఖ్యమైన అంశాలు చేర్చాలి'

సిరిపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమైన అంశాలపై జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ముందుగానే చేర్చాలని జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరీంద్రప్రసాద్‌కు జనసేన కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్ విన్నవించారు. ముఖ్యమైన అంశాలపై జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ముందు చర్చకు సంబంధించి అజెండాలో చేర్చాలని ముందుగానే అభ్యర్థించడం జరిగిందని, అయితే తాను కోరిన అంశాల్లో వచ్చే నెల 6న జరిగే కౌన్సిల్ సమావేశ అజెండాలో చేర్చలేదన్నారు. అదే కాపీని శుక్రవారం రాత్రి అందజేశారని దీంతో తాను ఆశ్చర్యానికి గురయ్యానన్నారు. కాబట్టి ఇదే విషయాన్ని వ్యక్తిగతంగా పరిశీలించి సకాలంలో అంశాలను అజెండాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

ఐటీ హబ్‌గా విశాఖ మరింత అభివృద్ధి : ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సిరిపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : రాబోయే రోజుల్లో మరింత వేగంగా ఐటీ హబ్‌గా విశాఖపట్నం మారనుందని విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు తెలియజేశారు. ఐటీ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయసహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్) విశాఖపట్నం రీజియన్ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి జ్యోతిప్రజ్వలన గావించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విశాఖపట్నంలోని మెట్రో ప్రాజెక్టు మొదలు కానుందని ఎప్పుడు మొదలైతే అప్పటి నుంచి నాలుగేళ్లలో దానిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇక్కడికి ప్రజాప్రతినిధిగా రాలేదని తనకు కూడా ఐటీ కంపెనీలు ఉన్నాయని తెలియజేశారు.ఐటీ రంగంలోని పని చేసే ఉద్యోగులు ఉండే ప్రాంతంలోని అన్ని విధాలా అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఐటీ ఉద్యోగులు సైతం మన రాష్ట్రాభివృద్ధిలో పాలుపంచుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలోని భాగంగా ఐటీ ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదే విధంగా వీఎంఆర్డీఏ పరిధిలోని సాఫ్ట్‌వేర్ రంగం కంపెనీలు పెట్టుకునేలా తాను వీఎంఆర్డీఏ ఛైర్మన్‌తో మాట్లాడతానని మీరంతా కూడా వెళ్లికలవాలని సూచించారు. తదుపరి ఐటాప్ వార్షిక వేడుకల్లో భాగంగా ఐటీ ఉద్యోగులకు నిర్వహించిన ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానోత్సవం చేశారు.కాగా సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉద్యోగులు దుమ్ము దూలిపారు.హుషారైన పాటలకు డ్యాన్స్‌లతో ప్రత్యేకంగామిమిక్రీ, స్కిట్స్‌తో అలరించారు. కార్యక్రమంలో ఐటాప్ స్టేట్ ప్రెసిడెంట్ లక్ష్మీముఖవల్లి, ఛైర్‌పర్సన్ కిశోర్ దాసరి, స్పోక్‌పర్సన్ ఆర్ఎల్ నారాయణ పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు

» 24 రోజులకు రూ.17,88,049 ఆదాయం


హుండీ ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ మెంబర్ టీఆర్ చోళన్

సిరిపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. గడిచిన 24 రోజులకు రూ.17,88,049 నగదు లభించినట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాద్‌రావు, ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. దేవాలయ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన హుండీ లెక్కింపులో బంగారం -002-300 మిల్లీ గ్రాములు, వెండి 000-125 గ్రాముల 500 మిల్లీ గ్రాములు, యుఏఈ దిరామ్స్ 20, మలేషియా రిగ్గిట్ 3, శ్రీలంక రూపాయలు 5, టాంజానియా షిల్లింగ్స్ 1000, ఎస్‌బీఐ చెక్కు రూ.111 వచ్చినట్టు తెలిపారు.ఈ లెక్కింపులో శ్రీవేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీదారులుగా ఎం.శ్రీధర్, దేవాలయ సిబ్బంది జి.గోవింద్‌రెడ్డి,డీఎస్ ప్రసాద్,బ్యాంక్ ఆఫ్ ఇండియాసిబ్బంది పాల్గొన్నారు

పుణ్యశ్లోకా అహల్యబాయి హోల్కర్ ఘన నివాళి



పుణ్యశ్లోకా అహల్యబాయి హోల్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎంఎంఎస్ పరశురామ్ రాజు, బీజేపీ ఇతర నేతలు

పెదవాల్తేరు మే 31 (ఆంధ్రజ్యోతి) : నగర బీజేపీ కార్యాలయంలో శనివారం పుణ్యశ్లోకా అహల్యబాయి హోల్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి పలువురుపూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామ్ రాజు మాట్లాడుతూ రాజమాత అహల్యాబాయి మహారాష్ట్రలోని మహ్మదీ నగర్ ప్రాంతానికి చెందిన చౌండే గ్రామంలో జన్మించారని, ఆమె తన పరిపాలన కాలంలో హిందూ మత కార్యలాపాలు, ధర్మిక కార్యక్రమాలు నిర్వహించి పేరొందారని అన్నారు. కాశీ ద్వారక జ్యోతిర్లింగాలు, ఇతర దేవాలయాలు నిర్మాణం చేపట్టారని, దేవాలయాల్లో అన్నసత్రాలను నిర్మించారని, దేవాలయాలలో పురోహితులుగా బ్రాహ్మణులను నియమించారని, వ్యవసాయం, రైతుల అభివృద్ధి కోసం ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.దామోదర్ యాదవ్, శ్రీరంగం ధనేశ్వరరావు, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాతా రాజ్, బీజేపీ విశాఖ పార్లమెంటు కన్వీనర్ ఎస్ఏ రామ్మోహన్, కామేష్ అయ్యగారి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కె.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం అనర్థదాయకం : ఆర్టీసీ ఆర్ఎం


కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు కోరారు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారీల వైద్య విభాగం శనివారం ద్వారకాబస్‌స్టేషన్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మా ట్లాడారు. పొగాకును ఏ రూపంలో వినియోగించినా అనర్థమేనన్నారు. మెదడు, ఊపిరితిత్తులు, గుండె, కాలేయం వంటి శరీర భాగాలకు నష్టం కలుగుతుందన్నారు. వీటివల్ల ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయన్నారు. బ్రహ్మకుమారి శశికళ మాట్లాడుతూ ఆరోగ్యకర జీవనానికి యువత పొగాకు, ఇతర మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిషేధించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి కల్యాణి, శేఖర్, విశాఖ ఈగల్ టాస్క్‌ఫోర్సు సీఐ, సిబ్బంది, బ్రహ్మకుమారీలు, పలువురు ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మాంసం దుకాణాలు తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


మాంసం దుకాణాలు తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నంనాయుడు

ఆరిలోవ, మే 31 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌లో నిబంధనలకు విరుద్ధంగా మాంసం విక్రయిస్తున్న దుకాణదారుడిపై జీవీఎంసీ 9వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నంనాయుడు కేసు నమోదు చేశారు. ఈ ప్రాంతంలోని మాంసం దుకాణాల్లో నిబంధనలు పాటించకుండా అమ్మకాలు సాగిస్తున్న వైనంపై శనివారం 'ఆంధ్రజ్యోతి' లో వచ్చిన కథనానికి స్పందించిన జీవీఎంసీ అధికారులు తనిఖీలు చేపట్టారు. కబేలా స్టాంపు లేకుండా మాంసం విక్రయిస్తున్న దుకాణదారుడిపై చర్యలు తీసుకున్నారు. మాంసం దుకాణదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నంనాయుడు స్పష్టం చేశారు.

కుక్కలకు యాంటీ రేబిస్ వాక్సిన్లు

ఆరిలోవ, మే 31 (ఆంధ్రజ్యోతి) : పెంపుడు కుక్కలకు ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యాంటీ రేబిస్ టీకాలను వేయించాలని జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్ అన్నారు. శనివారం పెదగదిలి జంక్షనులో పెంపుడు జంతువుల యజమానులకు యాంటీ రేబిస్ పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కల నుంచి ఈ వ్యాధి వ్యాపిస్తుందని తెలిపారు. ఈ వ్యాధి ఉన్న కుక్క జంతువులకు గాని, మనుషులకు గాని కరిస్తే ప్రమాదమన్నారు. కాబట్టి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలి. కార్యక్రమంలో 12వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావ, వెటర్నరీ సిబ్బంది, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేకే రాజు, వైసీపీ నేతలు

వెంకోజీపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జూన్ 4న వైసీపీ నగర అధ్యక్షులు కె.కె.రాజు సారథ్యంలో నిర్వహించనున్న వెన్ను పోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఎంవీపీ కాలనీలోని పార్టీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను దగా చేసి వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

సీతమ్మధార, మే 31 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో శనివారం ఖాతాదారుల సదస్సు నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ కె.విశ్వనాథ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ సీతమ్మధార బ్రాంచ్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటూ మూడో స్థానంలో నిలిచిందన్నారు. క్రమశిక్షణతో బ్యాంకులు పనిచేస్తున్నాయన్నారు. బ్యాంక్ డైరెక్టర్ నాగేశ్వరరావు, ఓఎస్‌డీ శాస్త్రి, ఏజీఎం పి.వీరభద్రరావు, ఖాతాదారులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ

మాధవధార, మే 31 (ఆంధ్రజ్యోతి): మాధవధారలో మూడు రోజుల యోగా శిక్షణ ముగిసింది. 9 వార్డుల సచివాలయాల సిబ్బంది, ఆర్పీలు హాజరయ్యారు. మాస్టర్ ట్రైనర్ వీరికి యోగా సాధనలో మెలకువలు, ఆసనాలు నేర్పించారు. యోగాతో చేకూరనున్న ప్రయోజనాలను వివరించారు. అధికారులు, స్థానిక నాయకులు సహా సచివాలయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు


విద్యుత్ దీపాన్ని అమర్చుతున్న సిబ్బంది

కంచరపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డు పరిధి పలు ప్రాంతాల్లో నూతన విద్యుత్ దీపాలను శనివారం సంబంధిత ఎలక్ట్రికల్ సిబ్బంది ఏర్పాటు చేశారు. వార్డు పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ దీపాలు లేక రాత్రి సమయాల్లో దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ గంకల కవిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అధికారులు స్పందించి శనివారం అవసరమైన చోట నూతన దీపాలు అమర్చేలా సిబ్బందికి సూచించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు, ఏఈ అర్చన పాల్గొన్నారు.

కెమికల్ కళాశాలలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు రాత పరీక్ష నేడు

కంచరపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రస్థాయి పోలీస్ నియామకాల బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న కానిస్టేబుళ్ల రాతపరీక్షకు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. కళాశాల పరిసరాల్లో 144వ సెక్షన్‌ను అమలు చేస్తున్నట్టు డా.కె.వి.రమణ తెలిపారు.

పొగాకు వినియోగంతో జీవితాలు ఛిన్నాభిన్నం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు హెచ్చరిక



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ జగదీశ్వరరావు

సీతమ్మధార, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు సేవనం ఓ వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేస్తుందని, అందుకే కేంద్ర ప్రభుత్వం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానాన్ని నిషేధించిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ పొగాకు నిర్మూలన దినం సందర్భంగా శనివారం ఆయన జెండా ఊపి చైతన్య ర్యాలీని ప్రారంభించారు. ధూమపానం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించేందుకు మే 31న పొగాకు వ్యతిరేక దినం జరుపుకుంటున్నామన్నారు. పొగాకు వినియోగాన్ని తగ్గించుకుంటూ పోవడమే ప్రధాన లక్ష్యమన్నారు. సిగరెట్టు, తంబాకు వినియోగించడం మరణానికి దారి తీస్తుందన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ హారిక మాట్లాడుతూ పొగాకు నియంత్రణకు అన్ని శాఖలు కలిసి పని చేయాలన్నారు. ప్రతి గ్రామంలో సభలు నిర్వహించాలని, పంచాయతీ సభ్యులు, ఎన్‌జీఓ సంస్థలు, రైతులు, యువత, విద్యార్థులు పాల్గొని పొగాకు రహిత భారత దేశ నిర్మాణం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు ధర్మేంద్ర, హెచ్ఈఈఓ మోహన్, ఎన్‌సీఓ మేనేజర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన


భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు

మురళీనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, వీఎంఆర్డీఏ చైర్మన్ కె.ప్రణవ్‌గోపాల్ శనివారం శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయితే 49, 50 వార్డుల పరిధిలో విద్యుత్ సరఫరా ఇబ్బందుల నుంచి ఉపశమనం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 13,500 కుటుంబాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. రూ.3.5 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మించనున్నట్టు ఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ జి.శ్యాంబాబు, జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గ ఇంచార్జి పి.ఉషాకిరణ్, నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ వి.ప్రసాద్, టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ హాజరయ్యారు.

ఏవోగా పదోన్నతి పొందిన రామ్మోహన్


శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉద్యోగులు

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న రామ్మోహన్‌కు ఏవోగా పదోన్నతి లభించింది. పదోన్నతి మేరకు ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఏవోగా ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు కేజీహెచ్ ఎంఆర్‌వో జవహర్ లాల్, గోపీ, పద్మాలోచన, ప్రసాద్, ఇతర ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్ని వర్గాలకు ప్రభుత్వం అండ: విష్ణుకుమార్‌రాజు


పింఛన్ అందచేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

మాధవధార/సీతంపేట/అక్కయ్యపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందని విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. సామాజిక పింఛన్లను ఆయన శనివారం మాధవధారలో అందజేశారు. రాష్ట్రంలో జూన్ నుంచి కొత్తగా 70 వేల మందికి పైగా కొత్త పెన్షన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులతో పాటు కొత్తగా స్పౌజ్ పేరుతో మరో కేటగిరీని ఏర్పాటు చేసి ప్రజలకు పింఛన్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వీఎంఆర్డీఏ చైర్మన్ కె.ప్రణవ్ గోపాల్, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని పలు వార్డులలో శనివారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. 25వ వార్డులో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ సీతంపేట ప్రాంతంలో పింఛన్లు అందజేశారు. 27వ వార్డులో కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి పంపిణీ చేశారు.


పింఛన్ అందిస్తున్న కార్పొరేటర్ వీరారావు

2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య పింఛను తీసుకుంటూ మృతి చెందిన వారి తరపున వారి భార్యలకు పింఛన్ అందించినట్లు చెప్పారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


నూతన వీధి దీపాలతో బొండా జగన్

వీధి దీపాల సమస్య పరిష్కారం

87వ వార్డులోని వడ్లపూడి, కణితి ప్రాంతాలకు 120 నూతన దీపాలు మంజూరు



కూర్మన్నపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి): జీవీ ఎంసీ 87వ వార్డు పరిధి లోని వడ్లపూడి, కణితిలో వీధి దీపాల సమస్యకు 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంతో పరిష్కారం లభించింది. వార్డులోని పలు కాలనీల్లో వీధి దీపాలు లేక జనం ఇబ్బందిపడేవారు. జనవరి 28న నిర్వహించిన 'అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో కాలనీవాసులు ఈ సమస్యను ప్రస్తావించారు. దీంతో కార్పొరేటర్ బొండా జగన్ వీధి దీపాల సమస్యను మేయర్‌తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో శనివారం 120 నూతన విద్యుత్ దీపాలను మంజూరయ్యాయి. దీంతో తమ సమస్య పరిష్కారమైందని కాలనీల వాసులు ఆనందం వ్యక్తంచేశారు. వీధి దీపాలు ఏర్పాటు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, వర్రె రాంబాబు, డీవీ అప్పారావు, రాజేంద్రప్రసాద్, శ్రీను, నూకరాజు, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొప్పరాజును విమర్శించే స్థాయి భూపతిరాజుకు లేదు

రాష్ట్ర వీఆర్వో సంఘం అధ్యక్షుడు ఆంజనేయకుమార్

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ చైర్మన్, రాష్ట్ర రెవెన్యూ సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లును విమర్శించే స్థాయి గ్రామపాలనాధికారు సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజుకు లేదని రాష్ట్ర వీఆర్వోల సంఘం అధ్యక్షుడు కె.ఆంజనేయ కుమార్ పేర్కొన్నారు. అమరావతి జేఏసీ విశాఖ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డితో కలిసి శనివారం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే ప్రభుత్వ శాఖలు, కార్యదర్శుల స్థాయిలో జేఎస్ఈ భాగస్వామ్య సంఘాలతో బొప్పరాజు సమావేశాలు ఏర్పాటు చేసి త్వరలో ముఖ్యమంత్రితో చర్చించేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. ఒకటో తేదీన జీతాలు పడడంతో ఉద్యోగులు సంతోషంగా ఉన్నారని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, నాలుగు డీఏలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతుంటే భూపతిరాజుకు వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. ఉద్యోగులు, పింఛన్‌దారుల సమస్యలపై బొప్పరాజు ఆధ్వర్యంలో ఏపీజేఏసీ పలు కార్యక్రమాలు చేపడుతుందని, రెవెన్యూమంత్రి, ఉన్నతాధికారులను కలిసి ఎప్పటికప్పుడు సమస్యలు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. బొప్పరాజు, ఇతర నాయకుల చొరవతో అధికారుల స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, త్వరలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలో స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అలాగే సీఎం చంద్రబాబును కలుస్తామన్నారు.

ఉక్కు లాభాల బాట

(5వ పేజీ తరువాయి)

సమయంలో కార్మికులలో అసంతృప్తి పెరగకుండా, భూములు ఇచ్చిన నిర్వాసితులకు అన్యాయం జరగకుండా చూడాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించినట్టు తెలిసింది. స్టీల్‌ప్లాంటు సక్రమంగా నడిచేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులకు అప్పగించినట్టు సమాచారం. స్టీల్ యాజమాన్యంతో సమన్వయం చేసుకుంటూ ఉత్పత్తి పెరిగేలా, తద్వారా లాభాలు వచ్చేలా చూడాలని చెప్పినట్టు తెలిసింది.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయనున్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, ఇతర గాడ్జెట్లను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో జెరాక్స్, కంప్యూటర్ కేంద్రాలను మూసియాలని ఇప్పటికే పోలీసు అధికారులు ఆదేశించారు.

ఎయిడెడ్ అధ్యాపకులు వెనక్కి...

(5వ పేజీ తరువాయి)

వారిని రిలీవ్ చేస్తూ వీసీ శనివారం ఆదేశాలు జారీచేశారు.

మిగిలిన 38 మంది

రాష్ట్రంలోని ఎయిడెడ్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులను 2021లో ఏయూలో చేర్చుకునేందుకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ ఉత్తర్వులు రావడానికి అప్పటి వీసీ ప్రసాదరెడ్డి కీలకంగా వ్యవహరించారు. తొలుత 113 మంది చేరేందుకు సుముఖత వ్యక్తంచేశారు. అయితే, అనేక కారణాల వల్ల 83 మంది మాత్రమే చేరారు. వారు చేరినప్పటి నుంచి వర్సిటీ వర్గాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో కొద్దిరోజుల్లోనే 43 మంది వెనక్కి వెళ్లిపోయారు. మరో 40 మందిలో ఒకరు చనిపోగా, మరొకరు కొద్దిరోజుల కిందట వర్సిటీ నుంచి వెనక్కి వెళ్లిపోయారు. మిగిలిన 38 మందిని తాజాగా వర్సిటీ అధికారులు రిలీవ్ చేశారు.

బదిలీల హడావిడి

(5వ పేజీ తరువాయి)

రెవెన్యూ వర్గాల్లో వినిపిస్తోంది. తమకు తలనొప్పులు తెచ్చే అధికారులను సాగనంపుతారని జోరుగా ప్రచారం సాగుతుంది. నగరానికి దక్షిణ ప్రాంతంలో పనిచేస్తున్న తహశీల్దారు ఒకరు భీమిలి నియోజకవర్గంలో ఒక మండలానికి వెళ్లేందుకు సిఫారసు లేఖ సంపాదించారని చెబుతున్నారు. ఇదిలావుండగా జల వనరుల శాఖలో గ్రామీణ ప్రాంతంలో ఉన్న కొందరు ఉద్యోగులు నగరానికి రావడానికి ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తీసుకున్నారు. కొందరు ఉద్యోగులు రెండు అంతకంటే ఎక్కువ లేఖలు సమర్పించారు. జిల్లా హౌసింగ్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు, ఇంజనీర్ల బదిలీకి అధికారులు జాబితా సిద్ధం చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యే బంధువునంటూ హల్‌చల్ చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఏఈని కూడా బదిలీ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఖజానా కార్యాలయంలో పరిధిలో బదిలీల నిర్వహణకు అధికారులు కమిటీ వేశారు. అయితే సంఘ నేతలమని కొందరు, ఇతరత్రా కారణాలతో మరికొందరు బదిలీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. పౌరసరఫరాల శాఖలో పలువురు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయాలని అధికారులు నిర్ణయించారు.


మాట్లాడుతున్న ఆర్‌టీఐ సౌత్ ఇండియా చైర్మన్ ఆల్ఫా కృష్ణ

హక్కుల రక్షణే ఆర్‌టీఐ లక్ష్యం

డాబాగార్డెన్స్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కుల రక్షణే ఆర్‌టీఐ లక్ష్యమని ఆర్‌టీ ఐ సౌత్ ఇండియా చైర్మన్ ఆల్ఫా కృష్ణ అన్నారు. ఎవరికి అన్యాయం జరిగినా ఆర్‌టీఐను సంప్రతించవచ్చునని తెలిపారు. శనివారం ఆయన డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్‌టీఐ మానవ హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని, ఇది ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కల్పిస్తుందన్నారు.

'ఫిట్జీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి'

డాబాగార్డెన్స్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఫిట్జీ విద్యా సంస్థపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ కళాశాల బాధితుల సంఘం అధ్యక్షుడు వాలిశెట్టి హరిచంద్ర డిమాండ్ చేశారు. శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిట్జీ కళాశాల యాజమాన్యం రెండేళ్ల ఐఐటీ, జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌డ్ కోర్సుల కోసం 200 మంది విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయల ఫీజు వసూలు చేసి ఆకస్మాత్తుగా మూసి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంస్థకు నగరంలోని శాంతిపురంలో ఒకటి, ఎంవీపీలో మరో బ్రాంచ్ ఉందన్నారు. శాంతిపురంలోని ఫ్యాకల్టీ సిబ్బంది మానేయడంతో అక్కడి విద్యార్థులను ఎంవీపీ బ్రాంచ్‌లో చేర్చారని తెలిపారు. మొదటి సంవత్సరం కోర్సు పూర్తి కాగానే ఎంవీపీలోని రెండో బ్రాంచ్‌ను కూడా మూసి వేశారన్నారు. దీనిపై ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని తెలిపారు. విద్యా శాఖా మంత్రి లోకేశ్ ఈ విషయమై దృష్టి సారించి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు

సీతంపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : హాస్టళ్లలో సెల్‌ఫోన్లు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసి 12 సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏడీసీపీ మోహన్‌రావు తెలిపారు. ద్వారకానగర్‌లోని శ్రీచక్ర బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న గణేష్ ఏప్రిల్ 7న నిర్వాహకుడు సోము రెడ్డికి ఫోను చేసి సెల్‌ఫోను కనిపించలేదని తెలిపాడు. హాస్టల్‌లో మరో ఆరుగురు కూడా తమ సెల్‌ఫోన్లు మాయమైనట్లు చెప్పారు. అదే భవనంలో ఉన్న మరో హాస్టల్‌లోనూ అయిదు సెల్‌ఫోన్లు చోరీ అయినట్లు తెలుసుకున్నారు. దీంతో సోమురెడ్డి ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైం సీఐ చక్రధర్‌రావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజ్‌ల ఆధారంతో నిందితుడ్ని గుర్తించారు. విజయనగరం జిల్లా గుర్ల మండలం గూడెం గ్రామానికి చెందిన కనకం దామోదరరావు ఎలియాస్ కార్తీక్, ఎలియాస్ దాము, ఎలియాస్ రోహిత్ (26) వీటిని చోరీ చేసినట్లు తేలింది. అతడు సెల్‌ఫోన్లు విక్రయించడానికి వెళ్తున్న సమయంలో చాకచక్యంగా పట్టుకున్నారు. వివిధ పోలీసు స్టేషన్లలో 20 వరకు సెల్‌ఫోన్లు అపహరించినట్లు కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

'ఆ పది అంశాలను అజెండాలో చేర్చాలి'

మహారాణిపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఈనెల 6వ తేదీన జరిగే కౌన్సిల్ సమా వేశంలో తాను ప్రతిపాదించిన పది అంశాలను అజెండాలో చేర్చాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఇన్ చార్జి కమిషనర్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు. శనివారం ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమైన ఆ పది అంశాలను కౌన్సిల్ సమావేశం అజెండాలో చేర్చాలన్నారు.

టీఎస్ సుకుమారన్ సేవలు చిరస్మరణీయం

సంస్మరణ సభలో వక్తలు


సుకుమారన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆచార్య చలం, జేవీ సత్యనారాయణమూర్తి, తదితరులు

డాబాగార్డెన్స్, మే 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఏ సాంస్కృతిక కార్యక్రమం జరిగినా మొదటిగా గుర్తుకొచ్చేది టీఎస్ సుకుమారన్ పేరేనని ఆచార్య కెఎస్ చలం అన్నారు. శనివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరివిజ్ఞాన కేంద్రంలో ఇస్కఫ్ ఆధ్వర్యంలో సుకుమారన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ స్నేహపాత్రుడైన సుకుమారన్ ఒక్కసారిగా దూరమైపోవడం దురదృష్టకరమన్నారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్)లో దేశవ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు ఉన్నారని, సంఘంతో 50 ఏళ్లుగా ఆయనకు ఎంతో అనుబంధం ఉందని చెప్పారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఇస్కఫ్‌లో సుకుమారన్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆయనతో కలిసిన జ్ఞాపకాలు, కార్యక్రమాలను మరోసారి గుర్తుచేసుకోవడం గొప్ప అనుభూతిగా నిలుస్తుందని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం, కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా పలు సేవలందించారని కొనియాడారు. అంతకముందు పలువురు సుకుమారన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాగితాల రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఆచార్య బాలమోహన్‌దాస్, పీవీఎస్ మూర్తి, కె. ప్రభాకర్ రావు, నరసింహులు, ఏ.జె. స్టాలిన్, ఎం. పైడిరాజు, మాధవ రావు, సురేశ్ కుమార్, క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.



పలు ప్రాంతాల్లో జడ్సీ పర్యటన

జ్ఞానాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : కాన్వెంటు కూడలి, 75 అడుగుల రోడ్డు, రామకృష్ణ జంక్షన్, రైతు బజార్ జంక్షన్ ప్రాంతాల్లో 4వ జోన్ కమిషనర్ మల్లయ్యానాయుడు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో ముంపునకు గల కారణాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.


ప్రసంగిస్తున్న ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు


కృష్ణ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న గండి బాబ్జి

ఘనంగా సినీ నటుడు కృష్ణ జయంతి

మహారాణిపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు సూపర్ స్టార్ కృష్ణ జయంతి విశాఖ సిటీ వైడ్ కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరస్వతీ పార్కులో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత అసోసియేషన్ సభ్యులు కేక్ చేసి, అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకుడు మన్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణ చలన చిత్ర పరిశ్రమకు చేసిన సేవలను కొనియాడారు, ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డొవర రమణ, కాకి సోంబాబు, గణేశ్, బి. ఉమా మహేశ్, అక్కరమాని శ్రీనివాస్, కేబుల్ శ్రీను, నీలాపు శ్రీనివాసరావు, ఏ. శంకరరావు, వెంకట్రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్ : తెలుగు చిత్ర సీమలో డేరింగ్ అండ్ డాషింగ్ హీరో సూపర్ స్టార్ కృష్ణ అని ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో పల్లావి మ్యూజిక్ సినీ సంగీత సంస్థ ప్రోగ్రాం కన్వీనర్ పల్లా బాబ్జీ ఆధ్వర్యంలో సినీ నటుడు కృష్ణ జయంతి ప్రత్యేక సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణకు ఏయూ డాక్టరేట్‌తో పాటు కళా ప్రపూర్ణ బిరుదు ప్రదానం చేసినట్టు తెలిపారు. అనంతరం గాయకులు ఎంవీ రాజశేఖర్, పల్లా బాబ్జీ, వెంకట్, వెంకటేష్, భాగ్యలక్ష్మీ, సీవీ రాజేశ్వరి, తదితరులు హీరో కృష్ణ నటించిన చలన చిత్రాల్లోని గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక సంస్థల అధినేతలు తిరుమలరావు, మూర్తి, శ్రీనివాస్, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : గ్రేటర్ విశాఖ 14వ వార్డులో సూపర్ స్టార్ కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు బ్యాటరీ అప్పారావు అధ్యక్షతన కృష్ణ జయంతి వేడుకలు నిర్వహించారు. ఏపీఏఐఎల్ఎఫ్ఈడీ చైర్మన్, టీడీపీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జి ముఖ్య అతిథిగా హాజరై కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు హైవే

(5వ పేజీ తరువాయి)

శుభ్రం చేసుకుంటుంటా. వీటితోపాటు హైవే పక్కన ఉండే ఇళ్లలో నివాసం ఉండేవారు, కార్యాలయాల్లో పనిచేసేవారు తమ వాహనాలను జాతీయ రహదారిపైనే పార్కింగ్ చేస్తున్నారు. రద్దీ సమయాలతో పాటు రాత్రివేళ జాతీయ రహదారిపై వాహనాల పార్కింగ్ కారణంగా ఆయా మార్గాల్లో ప్రయాణించేవారు ముందు వెళ్లే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. గత వారం రోజుల వ్యవధిలోనే సత్యం జంక్షన్ నుంచి గురుద్వారా వచ్చే మార్గంలో ఇద్దరు ద్విచక్ర వాహనదారులు మృతిచెందగా, ఇసుకతోట సిగ్నల్ సమీపంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. గురుద్వారా జంక్షన్ నుంచి హనుమంతవాక కూడలి వరకు జాతీయ రహదారిపై వాహనాల పార్కింగ్ నిత్యకృత్యంగా మారింది. వీటివల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. హైవేపై వాహనాల పార్కింగ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిసినా కూడా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. ట్రావెల్స్ నిర్వాహకులు, ఇతర వాహనాల యజమానులతో పోలీసులు అవగాహన కుదుర్చుకోవడం వల్లే వారు హైవేపై దర్జాగా పార్కింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారిపై పార్కింగ్‌లో ఉన్న వాహనాలను టోయింగ్ వెహికల్స్ ద్వారా స్టేషన్‌కు తరలించడం, అయినప్పటికీ ఎవరైనా పార్కింగ్ చేస్తే వాటికి జరిమానాలు విధించడం వంటి చర్యలు తీసుకుంటే హైవేపై పార్కింగ్‌కు అడ్డుకట్ట పడడంతోపాటు ప్రమాదాలకు కూడా అవకాశం ఉండదని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

ప్రత్యేక పుష్పాలతో శ్రీవారికి సహస్రనామార్చన


పూజలు అందుకుంటున్న శ్రీవారు

అక్కిరెడ్డిపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : షీలానగర్ ఎస్‌బీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్ర ంలో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున ప్రధానార్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకించి అనంతరం భక్తులు ఊరేగింపుగా తీసుకువచ్చిన పలు రకాల పుష్పాలతో స్వామి వారికి తోమాల సేవ చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దివ్యక్షేత్రంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను ఆశీనులను చేసిన వేదపండితులు పలు రకాల పుష్పాలతో సహస్ర నామార్చన, నక్షత్ర హారతి, కుంభ హారతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 3 నుంచి జరిగే తిరుమల బాలాజీ దివ్యక్షేత్ర బ్రహ్మోత్సవాలకు షీలానగర్‌కు చెందిన సూర్యదేవర వెంకట నరేష్, నవీన దంపతులు, వీరంకి మాధవరావు, శివలక్ష్మి దంపతులు పదివేల రూపాయిల చొప్పున విరాళాన్ని పాలకమండలి సభ్యులకు అందజేశారు. ఈ పూజలలో దివ్యక్షేత్రం పాలకమండలి సభ్యులతో పాటు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

పిల్లలకు జ్ఞాపకశక్తి పోటీలు

పెదగంట్యాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో నిర్వ హిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం పిల్లలకు జ్ఞాపక శక్తి పోటీలు నిర్వహించారు.పదేళ్ళలోపు చిన్నారులకు ఈ పోటీలు నిర్వహించారు. ఒక్కో విద్యార్థికి ఒక్కో అంశాన్ని ఇచ్చి దాన్ని చదివి తరువాత దాన్ని యథతథంగా చెప్పాలని పోటీలు నిర్వాహకులు వివరించారు. శాఖా గ్రంథాలయ నిర్వాహణాధికారి పీవీ రమణ ఈ పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ నిర్వాహణాధికారి ప్రకటించారు.

'పుస్తకాల వల్లే జనరల్‌నాలెడ్జి పెరుగుతుంది'

మల్కాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదవడం వల్ల జనరల్ నాలెడ్జి పెరుగుతుందని, తద్వారా చుట్టూ జరుగుతున్న విషయాలపైన, ప్రపంచం విషయాల మీద అవగాహన ఏర్పడుతుందని యువజన నాయకుడు బాల కిశోర్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో జనరల్ నాలెడ్జికు సంబంధించి శిక్షణ ఆయన శనివారం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్, ప్రభుత్వ పథకాలు, వార్తల పట్ల అవగాహన ఉండాలన్నారు. జర్నలిజం, పోటీ పరీక్షలలో విజయం సాధించాలంటే జనరల్‌నాలెడ్జి అవసరమని పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు21, టమాటా15, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 22, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ(పె)9, మునక్కాడలు(కిలో) 50, అల్లం (పాతది)54,బరబాటి 36, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూరపెండలం 26, బ్రకోలి 45 , పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర(పెద్దకట్ట) 20, పుదీన (కట్ట)4, చుక్కకూర(కట్ట) 4, పాలకూర(కట్ట)4, తోటకూర (కట్ట)4, మా మిడికాయలు 20, బూడిదగుమ్మడికాయ 20, కర్రపెండలం18, బొప్పాయి28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

యోగా డే కోసం విద్యార్థుల సన్నద్ధం

» ఉత్సాహంగా హైస్కూల్స్ మైదానాల్లో సాధన


యోగాసనాలు సాధన చేస్తున్న నడుపూరు హైస్కూల్ విద్యార్థులు

పెదగంట్యాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న నగరంలో రామకృష్ణా బీచ్‌లో నిర్వహించనున్న యోగాలో పాల్గొనేందుకు నడుపూరు, గంగవరం, ఇస్లాంపేటలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల విద్యార్థులు సిద్ధమవుతున్నారు. గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో తాము సైతం భాగస్వామ్యులం అవుతామంటూ చెబుతున్నారు. ఇందుకోసం సన్నాహక చర్యల్లో భాగంగా యోగా శిక్షణ పొందుతున్నారు. ఈ మూడు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చేందుకు మండల విద్యాశాఖాధికారులు పూర్తి సహాయసహకారాలు అందిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 6.00 నుంచి 7.30 గంటల వరకు పాఠశాలల మైదానాల్లో యోగా ప్రాక్టీస్ చేయిస్తున్నారు.

గంగవరం, ఇస్లాంపేట హైస్కూల్స్ మైదానాల్లో జరిగే యోగా శిక్షణా తరగతులను మండల విద్యాశాఖాధికారి-1 ఇ.శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు. ఒక్కో రోజు ఒక్కో హైస్కూల్‌లో జరిగే యోగాలో పాల్గొంటున్నారు. నడుపూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో జరిగే యోగా శిక్షణా తరగతుల్లో మండల విద్యాశాఖాధికారి-2 కె.రమణాజీ పాల్గొంటున్నారు. ఈ మూడు ఉన్నత పాఠశాలల నుంచి సుమారు వెయ్యిమంది విద్యార్థులు యోగా శిక్షణ పొందుతున్నారు.

వీరు కాకుండా పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలు కూడా యోగా ప్రాక్టీస్ చేయిస్తున్నాయి. వినాయకనగర్, వికాస్‌నగర్, పెదగంట్యాడ, ప్రియదర్శినీ కాలనీల్లోని పార్కుల్లో యోగా ప్రాక్టీస్ చేస్తున్నాయి. ఆరోగ్య భారతి వివిధ ప్రాంతాల శాఖలు కూడా యోగాపై ప్రత్యేక తరగతులు నిర్వహించి యోగా డేకు ఉత్సాహంగా సన్నద్ధమవుతున్నాయి.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

» ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


పింఛన్లు పంపిణీ చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మే 31 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలో శనివారం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చేస్తోందని, రాష్ట్ర ప్రగతే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గడిచిన ప్రభుత్వం హయాంలో అభివృద్ధి కుంటుపడిందని, నేడు అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా వృద్ధులు, దివ్యాంగులకు ఆసరాగా నిలిస్తోందని 79 వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం వార్డు పరిధిలోని కేఎస్ఎన్. రెడ్డినగర్‌లో ఆయన పాల్గొని ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కరణం జగదీశ్, వార్డు మహిళా అధ్యక్షురాలు గల్లా హనిత, స్థానిక నాయకులు సుబ్బరాజు, సూర్యనారాయణ, రుద్రకుమార్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో..

కూర్మన్నపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 86వ వార్డు రాసాలమ్మ కాలనీలో శనివారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపట్టారు. కూటమి నాయకులు నల్లూరు సూర్యనారాయణ, కాద శ్రీను పాల్గొని పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు సెక్రటరీ వేగుంట శ్రీనివాస్, కె.రమేష్, జగదీష్, ఎం.గణపతి, నాగార్జున, సుబ్బయ్య, వెంకటేష్, సింహాద్రి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


అగనంపూడి : కేఎస్ఎన్ రెడ్డి నగర్‌లో పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

డాక్టర్ భారతి సేవలు అమోఘం

» ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


డాక్టర్ భారతిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అగనంపూడి, మే 31 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో డాక్టర్ భారతి చేసిన సేవలు అమోఘమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా పని చేసి ఉద్యోగ విమరణ చేసిన భారతి దంపతులను శనివారం ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందించడంలో భారతి ఎంతగానో కృషి చేశారన్నారు. అంకితభావంతో పనిచేసే వారికి సమాజంలో ఎల్లప్పుడు మంచి పేరు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, వైద్య విధాన పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రసాద్, వైద్యులు ఉష. గోపీకృష్ణ, లలిత, ఏవో రవిరాజ్, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, స్థానిక నాయకులు కర్రి దేశేంద్ర, గల్లా రాజు, గవర సోమశేఖర్, వసంత్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందూ దేవాలయాలకు కళతెచ్చిన మహిళామణి అహల్యబాయి

» మహిళమోర్చ కార్యవర్గసభ్యురాలు భువనేశ్వరిదేవి

పెదగంట్యాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న హిందూ ఆలయాలను పునర్నిర్మిచడానికి వాటికి కళతెచ్చిన హోల్కర్ వంశరాణి అహల్యబాయి హోల్కర్ అని బీజేపీ రాష్ట్ర మహిళామోర్చా కార్యవర్గసభ్యురాలు భువనేశ్వరిదేవి అన్నారు. అహల్యాబాయి జయంతి సందర్భంగా శనివారం నడుపూరు కమ్యూనిటీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 1767 నుంచి 1795 వరకు మహరాష్ట్రలోని ఇండోర్ రాణిగా వ్యవహరిస్తూ హిందూదేవాలయాల పునరుద్దరించారని అన్నారు.

నేటి నుంచి రేషన్‌షాపుల్లోనే సరకులు పంపిణీ

మల్కాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి రేషన్‌షాపుల ద్వారా రేషన్ అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. జీవీఎంసీ 40, 58 నుంచి 63 వార్డుల పరిధిలో దాదాపుగా 35 రేషన్ షాపులున్నాయి. అలాగే యారాడ గ్రామంలో ఒక దుకాణం ఉంది. 2014- 2019 టీడీపీ ప్రభుత్వంలో ఎవరైతే డీలర్లుగా ఉండేవారో వారే రేషన్ అందించేందుకు సిద్ధమయ్యారు. ఈ ఐదేళ్లలో చనిపోయిన రేషన్ డీలర్ల డిపోను పక్క డీలర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ ప్రాంతంలో ఉన్న ఒక్కొక్క డిపోకు సుమారు వెయ్యి రేషన్ కార్డులు, పది అంత్యోదయ కార్డులు ఉన్నాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 వరకు రేషన్ అందుబాటులో ఉంటుంది. ప్రతి నెల 1వ తేదీ నుంచి 15 వరకు రేషన్ తీసుకోవచ్చు.

సీసీ కెమెరాలు తప్పనిసరి

రాష్ట్రంలో ప్రతి రేషన్ డిపోకు సీసీ కెమెరాలు తప్పనిసరని సూచించింది. కానీ ఏ ఒక్క దానిలోను సీసీకెమెరాలు లేవు. సీసీలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందా? డీలరే ఏర్పాటుచేసుకోవాలా? అనే విషయంపై స్పష్టత లేదు. దీంతో ఏ ఒక్క రేషన్ డిపోలోను సీసీలను ఏర్పాటు చేయలేదు.


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ భుజంగరావు

రేషన్ పంపిణీలో పాల్గొనున్న గణబాబు

స్థానికంగా ఉన్న 279 నంబర్ రేషన్ డిపోను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రేషన్‌కు వచ్చిన వారికి గణబాబు తన చేతుల మీదగా సరుకులు అందజేయనున్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు: తహశీల్దార్ భుజంగరావు

ములగాడ మండల కార్యాలయంలో తహశీల్దార్ భుజంగరావు శనివారం ఉదయం రేషన్‌డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. రేషన్ పంపిణీకి సంబంధించి నిబంధనలు వివరించారు. వృద్ధులకు, దివ్యాంగులకు రేషన్ ఇంటికెళ్లి అందించాలని సూచించారు. రేషన్‌షాపు నిర్వహణను ఎప్పటికప్పుడు వీఆర్‌వోలు పర్యవేక్షిస్తుంటారని వివరించారు. బియ్యాని బ్లాక్‌లో అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం


నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, మే 31(ఆంధ్రజ్యోతి): విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గోపాలపట్నంలోని జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యాలయ ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పశ్చిమ ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ గౌరవ అధ్యక్షుడు పి.గణబాబు నూతన కమిటీ అధ్యక్షురాలు ఎలమంచిలి అపర్ణ, ఉపాధ్యక్షుడు వెంకుమహంతి చంద్రశేఖర్‌తో పాటు 13 మంది డైరెక్టర్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. మార్కెటింగ్ శాఖ అధికారుల్ని సమన్వయం చేసుకుని జిల్లా మార్కెట్ శాఖ పరిధిలోని సమస్యలను పరిష్కరానికి నూతన కమిటీ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నామినేటెడ్ పోస్టులను త్వరలో భర్తీ చేసే దిశగా ప్రయత్నాలు జరగుతున్నాయని అన్నారు. ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మరో పదిహేనేళ్ల అధికారంలో కొనసాగితే రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, కూటమి విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యేలు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అధికారులు సుధాకర్, యాసీన్, పాపారావు, కార్పొరేటర్‌లు, రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

» ఎమ్మెల్యే గణబాబు


లబ్ధిదారులకు పింఛను అందిస్తున్న గణబాబు

అక్కిపేట, (కంచరపాలెం), మే31(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 57వార్డు పరిధి తుమ్మడిపాలెం, సుభాష్ నగర్‌లో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు శనివారం పింఛన్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఒకటో తేది ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు ప్రభుత్వం అందజేసింది. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతు అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే దృష్టికి వెళ్లిన పించనుదారుల సమస్యల గురించి సంబంధిత అధికారులుతో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు, కార్పొరేటర్ ముర్రువాణి, జోనల్ కమిషనర్ రాము, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్ష కేంద్రాలు పరిశీలన

పెందుర్తి, మే 31(ఆంధ్రజ్యోతి): ఏపీ పోలీస్ రిక్రూట్మెంట్ ఆధ్వర్యంలో పోలీసు కానిస్టేబుల్స్ నియమాక పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. ఈ క్రమంలో పరీక్షకు సంబంధించి పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదర్శ్ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల డిప్యూటీ కమిషనర్ మేరీ ప్రశాంతి శనివారం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, సీసీ కెమెరాల గురించి, భద్రత విషయాలపై ఆరా తీశారు. పరీక్ష సమయంలో తీసుకోవాల్సి జాగ్రత్తలు గురించి సిబ్బందికి ఆమె సూచించారు. పరీక్ష మొత్తం పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ నిఘా బృందాలు పనిచేస్తున్నాయని డీసీ మేరి ప్రశాంతి తెలిపారు. ఈ క్రమంలో రెండు పరీక్ష కేంద్రాల్లో 752 మంది అభ్యర్థులు పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష రాయనున్నారని, అభ్యర్థులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ పృథ్వీరాజ్, సీఐ కేవీఎస్ సతీశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గెడ్డల సర్వే

వేపగుంట, మే 31(ఆంధ్రజ్యోతి): వేపగుంట పరిధిలో గౌతమ్‌నగర్‌లోని 66, 110, 90 సర్వే నెంబరుల్లో గెడ్డలను రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించారు. సంలోచర్ల రమణాజీ అనే వ్యక్తి ఫిర్యాదు మేరక ఈ సర్వే చేశామన్నారు. ఈ సందర్భంగా గెడ్డలను ఆనుకుని ఉన్న షెడ్డులు, భవనాల ఫొటోలను అధికారులు సేకరించారు. వీటిపై త్వరలోనే నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ సర్వేలో పెందుర్తి సర్వేయర్ శ్రీరామమూర్తి, కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారి కొండలరావు, లోచర్ల రమణాజీ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రిలే నిరాహారదీక్ష కార్యాచరణ ప్రకటన

ఉక్కుటౌన్‌షిప్, మే 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే నిరాహారదీక్ష పోరాట కార్యాచరణను శనివారం పోరాట కమిటీ కన్వీనర్ కేఎస్ఎన్ రావు ప్రకటించారు. జూన్ 1న కాంట్రాక్టు కార్మికులు 4, 7, 12, 17, 26 తేదీల్లో ఏఐటీయూసీ, 2, 5, 9, 13, 19, 23, 27 తేదీల్లో ఇంటక్, 3, 6, 11, 16, 20, 25, 30 తేదీల్లో సీఐటీయూ, 8న కాంట్రాక్టు కార్మికులు (వైఎస్సార్‌టీయూసీ), 10న డీఎస్ఈయూ, టీఎన్‌టీయూసీ, 14,28న యూజ్, టీఐటీయూ, వీఎస్ఎంఎస్, వీఎస్ఈయూ, వీఎస్‌పీఈయూ, 15న కాంట్రాక్టు కార్మికులు (టీఎన్‌టీయూసీ), 18న ఓబీసీ అసోసియేషన్, 26న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, 29న కాంట్రాక్టు కార్మికులు (హెచ్ఎంఎస్) యూనియన్లు రిలే నిరాహారదీక్షలో కూర్చోనున్నారు.

సరకుల పంపిణీకి ఏర్పాట్లు

» సర్కిల్-3 పరిధిలో 146 రేషన్ డిపోలు
» రేషన్ లబ్ధిదారులు లక్షా 33 వేల మంది
» డీలర్లకు పలు సూచనలు చేసిన అధికారులు

గాజువాక, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రేషన్ డిపోల వద్దే ఆదివారం నుంచి రేషన్ లబ్ధిదారులకు రేషన్ సరకులు పంపిణీ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో అధికారులు ఇప్పటికే డీలర్లకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పలు మార్గదర్శకాలను సూచించారు. గత ప్రభుత్వం రేషన్ సరకులను ఇళ్ల వద్దే పంపిణీ చేయగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్ల వద్ద రేషన్ సరకుల పంపిణీకి స్వస్తిపలికి, పాత పద్ధతి మాదిరిగా రేషన్ డిపోల్లోనే సరకుల పంపిణీకి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.

146 రేషన్ డిపోలు, లక్షా 33 వేల మంది లబ్ధిదారులు

సర్కిల్-3 పరిధిలో 146 రేషన్ డిపోలు ఉండగా, సుమారుగా లక్షా 33వేల మంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారు. కాగా, రేషన్ డిపోల వద్దే సరకులు పంపిణీ చేయనుండడంతో ఎటువంటి అవకతవకలు జరగకుండా అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. అధికారులు దఫదఫాలుగా డీలర్లకు సమావేశాలు నిర్వహించి రేషన్ సరకుల పంపిణీలో అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. తూకంలో తేడా వచ్చినా, ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించినా, లబ్ధిదారుల విషయంలో దురుసుగా ప్రవర్తించినా సదరు డీలర్లపై కఠిన చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. సర్కిల్-3 ఏఎస్‌వో కృష ఇప్పటికే అన్ని డిపోలను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు చేశారు.

గ్రీన్‌సిటీలో సినీ కథానాయుడు కృష్ణ జయంతి వేడుకలు

» రోటరీ క్లబ్‌కు 72 యూనిట్లు రక్తం అందజేసిన అభిమానులు


కృష్ణకు నివాళి అర్పిస్తున్న అభిమానులు

కూర్మన్నపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీలో శనివారం సూప ర్ స్టార్ కృష్ణ 82వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. సినీనటుడు కృష్ణ వీరాభిమాని భావినేని. చిన్న సురేష్ పర్యవేక్షణలో గ్రీన్‌సిటీ క్లబ్‌లో నిర్వహించిన వేడుకల్లో తొలుత కృష్ణ చిత్రపటానికి అభిమానులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేకును కట్ చేసి మిఠాయిలు పంచారు. వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేష్ కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావు మాట్లాడుతూ చలన చిత్ర పరిశ్రమకు కృష్ణ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రైజ్ ఆస్పత్రి, రోటరీ క్లబ్ సహాయ సహకారాలతో వైద్య, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 70 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో యార్లగడ్డ వెంకన్న చౌదరి, అబ్బాస్ హుస్సేన్, వైద్యులు వేగి అవినాష్, సుధామోహన్, హరీష్, వైజాగ్ ప్రొఫైల్స్ సిబ్బంది నాదేళ్ల వినయ్, సునీల్, గణేష్, నరసింహ, హైమా, చాందినీ, సౌమ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సూపర్ స్టార్ కృష్ణకు ఘన నివాళి


కేక్‌కట్ చేస్తున్న అభిమానులు

పెదగంట్యాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : చలనచిత్ర రంగంలో దివంగత నటశేఖర కృష్ణ ఒక ధ్రువతార అని టీడీపీ 75వ వార్డు అధ్యక్షుడు, కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నమ్మి అప్పారావు అన్నారు. కృష్ణ జయంతి సందర్భంగా సీతానగరంలో కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం కృష్ణ చలనచిత్రరంగానికి, సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కృష్ణ, మహేష్‌బాబు అభిమాన సంఘాల ప్రతినిధులు నక్క అప్పారావు, నమ్మి అప్పలనాయుడు, వియ్యపు శివ, నమ్మి రాము, మొల్లి వెంకునాయుడు, చట్టి గోవిందమ్మ, తులసి తదితరులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్లకు 'సికిల్‌సెల్ అనీమియా'

కొయ్యూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం చిన్నపాడు పంచాయతీ గోపవరానికి చెందిన ఆరేళ్ల బాలిక శనివారం సాయంత్రం సికిల్‌సెల్ అనీమియాతో మృతిచెందింది. ఆమె సోదరి కూడా ప్రస్తుతం ఆస్పత్రిలో ఉంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దవళ దారబాబు, దేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు భాగ్యశ్రీ (10), యోధశ్రీ (6). ఇద్దరూ సికిల్‌సెల్ అనీమియా వ్యాధితో బాధపడుతున్నారు. భాగ్యశ్రీని రెండు రోజుల క్రితం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం ఉదయం యోధశ్రీని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందింది. కాగా భాగ్యశ్రీని మెరుగైన వైద్య సేవల నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించాలని వైద్యులు సూచించారు.

డాక్‌యార్డులో నాగుపాము హల్‌చల్

మల్కాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): నేవల్ డాక్‌యార్డులో శుక్రవారం అర్ధరాత్రి ఓ నాగుపాము హల్‌చల్ చేసింది. ఆ సమయంలో కొంతమంది ఉద్యోగులు నాగరాజు అనే స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇచ్చారు. నాగరాజు డాక్‌యార్డుకు చేరుకుని పామును పట్టుకుని ఒక సంచిలో పెట్టాడు. శనివారం ఉదయం పామును విడిచి పెట్టేందుకు బయటకు తీయగా, ఆ సంచిలో పాము గుడ్లు కూడా ఉన్నాయని నాగరాజు చెప్పాడు. తాను సంచిలో పామును పెట్టే సమయంలో గుడ్లు లేవని, ఆ తరువాత అది గుడ్లు పెటిందని అన్నాడు. పామును విడిచిపెట్టి, గుడ్లను అటవీశాఖ అధికారులకు అప్పగించానని అతను పేర్కొన్నాడు.

ముగిసిన యోగా శిక్షణ తరగతులు

మల్కాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి ప్రాంగణంలో ఈనెల 29 నుంచి ప్రారంభమైన యోగా శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. జీవీఎంసీ జోన్ 5 ఆధ్వర్యంలో ఈ మూడురోజులు యోగా గురువులు సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇస్తూనే దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. శనివారం జరిగిన యోగా శిక్షణలో స్థానిక మహిళలు పాల్గొన్నారు. యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని పలువురు మహిళలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, యోగా గురువులు పాల్గొన్నారు.

అహల్యబాయ్ హోల్కర్‌కు ఘన నివాళి

పెందుర్తి, మే 31 (ఆంధ్రజ్యోతి): పుణ్యశ్లోక అహల్యబాయ్ హోల్కర్ 300వ జయంతి కార్యక్రమం శనివారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో పెందుర్తిలోని నైపుణ్య శిక్షణ కంప్యూటర్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హోల్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైందవ మతానికి హోల్కర్ చేసిన సేవలను కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ఆమె పేరు మీద స్త్రీశక్తి పురస్కారాన్ని నెలకొల్పారని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నాది.

రేషన్ డిపోను ప్రారంభించనున్న పంచకర్ల

వేపగుంట, మే 31(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు పరిధిలో శ్రీనివాసనగర్‌లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు రేషన్‌షాపును ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ప్రకారం రేషన్ డిపోలు ద్వారా సరకులు సరఫరా చేస్తున్నామని ఎమ్మెల్యే కార్యాలయం వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

డ్రైవింగ్‌తో ఉపాధికి ఊతం

» స్వల్పకాలిక శిక్షణతో ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగావకాశాలు

» పోటీపడుతున్న యువతీ యువకులు

కంచరపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి): **ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం, లేకపోతే తమ కాళ్లపై తాము నిలబడి స్వయం ఉపాధి పొందడమే లక్ష్యంగా యువత డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతోంది. నగరంలోని కంచరపాలెంలోని ప్రభుత్వ పాత ఐటీఐ వీరికి ఊతమిస్తోంది. స్వల్పకాలిక కోర్సు (45 రోజులు)గా డ్రైవింగ్‌లో శిక్షణ పూర్తిచేశాక ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో ఉపాధిని సొంతం చేసుకుంటున్నారు. యువకులతోపాటు యువతులు కూడా డ్రైవింగ్ శిక్షణకు ముందుకు రావడం గమనార్హం.**


బస్సు నడుపుతున్న యువకుడు (ఫైల్)

అభ్యర్థులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణ ఇస్తున్నారు. వాహనం నడపడంలో ప్రాథమిక అంశాలు, నిర్వహణ, టైర్ల మార్పిడి, ఇంజన్ పనితీరు గురించి తెలియజేయడం, ట్రాఫిక్ సిగ్నల్స్, వివిధ మార్గాల్లో వాహనాలు నడిపే తీరు, ఎత్తుపల్లాల దగ్గర వాహనం నడిపే విధానం, ట్రాఫిక్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ... తదితర అంశాలను క్షుణ్ణంగా వివరిస్తూ లైట్ (కారు), హెవీ (బస్సు) డ్రైవింగ్‌లో నిపుణులు శిక్షణ ఇస్తుండడం ఇక్కడి ప్రత్యేకతగా చెప్పవచ్చు.

ఇందులో చేరాలంటే...

కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో డ్రైవింగ్ కోర్సులో శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు పదోతరగతి ఉత్తీర్ణతతో పాటు ఆర్టీవో బ్యాడ్జ్ కలిగి ఉండాలి. అభ్యర్థుల వయస్సు 21 ఏళ్లు నిండి ఉండాలి. హెవీ, ఎల్ఎల్ఆర్ లైసెన్సు ఉండాలి. నాలుగు చక్రాల వాహనం నడపాలంటే ఎల్ఎల్ఆర్‌తో పాటు పదోతరగతి ఉత్తీర్ణత పొంది 18 ఏళ్లు నిండి ఉండాలి. అలాగే శిక్షణ రుసుముగా రూ.3 వేలు చెల్లించాలి.

శిక్షణానంతరం ధ్రువపత్రాలు ...

ప్రభుత్వ ఐటీఐలో డ్రైవింగ్ శిక్షణ పొందే అభ్యర్థులకు మెలకువలు నేర్పడంతో పాటు అవుట్‌డోర్‌లోనూ శిక్షణ ఇస్తారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. ప్రభుత్వ ఐటీఐలో జారీ చేసిన సర్టిఫికెట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంటున్నందున ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అభ్యర్థులకు ఉపాధి కల్పిస్తున్నాయి. వివిధ ప్రభుత్వ సంస్థల్లో డ్రైవర్ ఉద్యోగాలకు ఇచ్చే నోటిఫికేషన్‌లో ప్రభుత్వ ఐటీఐల్లో శిక్షణ పొందేవారికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుండడంతో ఇక్కడ డ్రైవింగ్ పొందేందుకు అత్యధికులు ఆసక్తి కనబరుస్తున్నారు.

అందుబాటులో ఉన్న వాహనాలు...

ఇక్కడ యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు పలు రకాల వాహనాలు అందుబాటులో ఉన్నాయి. శిక్షణ అందించే బస్సు పాతది కావడంతో మాజీ ఎంపీ కంభంపాటి హరిబాబు తన ఎంపీ కోటా నిధులతో గతంలో కొత్త బస్సును సమకూర్చారు. ప్రస్తుతం ఈ బస్సులోనే శిక్షణ ఇస్తున్నారు.

ఉద్యోగావకాశాలు పుష్కలం

ఇక్కడ శిక్షణ పొందిన అభ్యర్థులకు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. పోలీస్, అగ్నిమాపక సంస్థ, ఆర్టీసీ, రైల్వే, మిలటరీ, ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఎంఈఎస్), ఇండియన్ కోస్ట్‌గార్డు, సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర సంస్థల్లో ఉద్యోగాలు పొందడానికి అర్హులుగా గుర్తింపు పొందుతారు. ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు రానివారు కారు కొనుక్కుని డ్రైవర్‌గా ఉపాధి పొందుతుంటారు. క్యాబ్‌లు, ఉబర్, ఓలా తదితర సంస్థల్లోనూ పనిచేస్తుంటారు. ఆర్థిక స్థోమత లేని వారు పలు ట్రావెల్ ఏజెన్సీలు, ప్రైవేటు వ్యక్తుల వద్ద డ్రైవర్లుగా పనిచేస్తుంటారు. ఐటీఐలో శిక్షణ పొందిన వందలాది మంది ఇప్పటికే వివిధ ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తుండడం గమనార్హం.


బస్సు మరమ్మతు చేస్తున్న శిక్షణార్థులు

శిక్షణలో నైపుణ్యం



ప్రభుత్వ ఐటీఐలో చేరిన నిరుద్యోగులకు నాణ్యమైన డ్రైవింగ్ శిక్షణ లభిస్తుంది. ఇక్కడ శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కొందరికి వస్తుంటాయి. మరికొందరు సొంతంగా వాహనాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. శిక్షణ పొందిన అనంతరం వారికి ప్రభుత్వం ధ్రువీకరణ పత్రం అందిస్తుంది.

\- జె.శ్రీకాంత్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాత ఐటీఐ

శిక్షణ చాలా బాగుంది



ప్రభుత్వ ఐటీఐలో అందిస్తున్న డ్రైవింగ్ శిక్షణ చాలా బాగుంది. వివిధ సందర్భాల్లో వాహనాలు ఎలా నడపాలో మెలకువలు అందిస్తున్నారు. చక్కని నైపుణ్యంతో కూడిన శిక్షణ పొందడం ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది. రద్దీగా ఉండే రోడ్లు, కొండప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు వాహనాలు ఎలా నడపాలో ప్రాక్టికల్‌గా నేర్పిస్తున్నారు.

\- ప్రశాంత్, శిక్షణపొందుతున్న యువకుడు

ఉపాధి కోసం చేరా...



ఇక్కడ డ్రైవింగ్ శిక్షణ తీసుకుని వాహనాన్ని నడిపి స్వయం ఉపాధి పొందడానికి చేరాను. డ్రైవింగ్‌తో పాటు ట్రాఫిక్ నియమాలు, థియరీ క్లాసులు బాగున్నాయి. శిక్షణ పూర్తిచేసుకుని మంచి డ్రైవర్‌గా స్థిరపడతా..

\- జి.మణికంఠ

మెలకువలు నేర్పుతాం



ఐటీఐలో లైట్ మోటార్, హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణలో చేరాక వివిధ మెలకువలు నేర్పుతాం. డ్రైవింగ్‌తో పాటు వెహికల్ మధ్యలో ఆగిపోతే మరమ్మతులు ఎలా చేయాలి? అన్న అంశంపై ప్రత్యేక అవగాహన కల్పిస్తాం. శిక్షణలో బాగంగా వివిధ ట్రాఫిక్ నియమాలు నేర్పిస్తాం. వందలాది మంది నిరుద్యోగులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చాం.

\- సత్యనారాయణ, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టరు

క్రైం... crime news

మాటలతో మభ్యపెట్టి మస్కా!

» మహిళల వద్ద నగలు కాజేసిన ఇద్దరు కి'లేడీల' అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న క్రైమ్ ఎస్ఐ సూరిబాబు


స్వాధీనం చేసుకున్న బంగారం వస్తువులు

పెందుర్తి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆటోలు, బస్సుల్లో ప్రయాణికుల మాదిరిగా నటిస్తూ మహిళా ప్రయాణికులను మాటలతో మభ్య పెట్టి ఏమరుపాటుగా ఉన్న సమయంలో వారి బ్యాగులు తస్కరించి అందులో గల బంగారు ఆభరణాలు మాయం చేసే ఇద్దరు కిలాడీ మహిళలను పెందుర్తి నేర విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 50 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం నేర విభాగ ఎస్ఐ సూరిబాబు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. వేపగుంట సింహపురి కాలనీలో నివాసముంటున్న తాలిశెట్టి మంగతాయారు గోపాలపట్నంలోని కో-ఆపరేటివ్ బ్యాంకులో బంగారు గొలుసు కుదువ పెట్టేందుకు వేపగుంట జంక్షన్‌లో ఆటో ఎక్కింది. నాయుడుతోట వద్ద ఇదే ఆటోలో ఓ మహిళ ఎక్కి ఆమెను మాటల్లోకి దించి గోపాలపట్నం బంక్ వద్ద దిగింది. మంగతాయారు బ్యాంకు వద్దకు వెళ్లి బ్యాగు తీసి చూడగా అందులో బంగారు గొలుసు భద్రపరిచిన పర్స్ కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన ఆమె ఆటోలో ప్రయాణించిన సహచర మహిళ చోరీ చేసిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విజయనగరం జిల్లా గుర్ల మండలం బీసీ కాలనీలో నివాసముంటున్న గొలజాన మోహిని వ్యక్తిగత పనులపై రాంపురంలోని బంధువుల ఇంటికి వచ్చింది. పనులు పూర్తయ్యాక తిరుగు ప్రయాణంలో బంగారు వస్తువులున్న పర్స్‌ను బ్యాగులో పెట్టుకుని విజయనగరం వెళ్లేందుకు పెందుర్తి జంక్షన్‌లోని బస్టాప్‌లో తన ఊరు బస్సు రాగానే ఎక్కి సీటులో కూర్చుంది. టికెట్ తీద్దామని ఒడిలో ఉన్న బ్యాగు తెరిచి చూడగా జిప్ తెరిచి ఉంది. దీంతో ఆందోళన చెంది లోపల వెతకగా బంగారు వస్తువులు భద్రపరిచిన పర్స్ కనిపించలేదు. బస్సు ఎక్కేటప్పుడు తనను తోసుకుంటూ వచ్చిన మహిళ ఈ చోరీ చేసి ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధిత మహిళలు అందజేసిన వివరాల ప్రకారం క్రైమ్ ఎస్ఐ సూరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. చోరీ జరిగిన స్థలాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బాధిత మహిళలు చెప్పిన ఆనవాళ్లతో కేసులో పురోగతి కనిపించడంతో ఈ చోరీలు పాత నేరస్థులైన ఎర్రగొల్లల ముఠా కిలాడీ మహిళల పనిగా నిర్ధారించారు. దీంతో పోలీసులు అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం గొట్లం గ్రామానికి చెందిన రావుల వసంత(25), మేకల సంధ్య(27) లను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. నేరం నిర్ధారణ కావడంతో వారి వద్ద నుంచి చోరీ చేసిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని మహిళలను అరెస్ట్ చేశారు.

బెంగళూరులో వీఎంఆర్‌డీఏ రోడ్ షో

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ(వీఎంఆర్‌డీఏ) మధురవాడలోని 87.80 ఎకరాలను జాయింట్ వెంచర్ కింద అభివృద్ధి చేయడానికి బెంగళూరులో శనివారం రోడ్ షో నిర్వహించింది. మధురవాడ హైట్స్ పేరుతో ఈ స్థలాన్ని ఎలా అభివృద్ధి చేస్తే ఉపయోగకరం అనే భావనతో పాటు దానికి అమలు చేయడానికి, పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే సంస్థలను ఆహ్వానిస్తూ తొలుత విశాఖలో, ఆ తరువాత హైదరాబాద్‌లో సమావేశాలు నిర్వహించారు. ఇపుడు బెంగళూరులోని నైట్ ఫ్రాంక్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ సంస్థలైన గోద్రెజ్, ఉషా శ్రీరామ్ ప్రాపర్టీస్‌తో పాటు అక్కడి రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రమేశ్ సంస్థ ఆలోచనలను వివరించగా, ఈ కార్యక్రమంలో సీయూపీ శిల్ప, చీఫ్ ఇంజనీర్ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


బెంగళూరులో పారిశ్రామికవేత్తలతో చర్చిస్తున్న జాయింట్ కమిషనర్ రమేశ్

ఇద్దరిపై అట్రాసిటీ కేసు

ఆనందపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం గ్రామానికి చెందిన రౌడీ షీటర్, అతని భార్యను అట్రాసిటీ కేసు కింద అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు సీఐ చింతా వాసునాయుడు శనివారం తెలిపారు. రౌడీ షీటర్ మీసాల అప్పలనాయుడు, అతని భార్య శ్రీదేవి విశాఖ రామా టాకీస్ ప్రాంతానికి చెందిన కుంచంగి లక్ష్మి (55)కి భూమి అమ్ముతామని చెప్పి రూ. 97 లక్షలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేశారు. 2020లో కుంచంగి లక్ష్మి మధ్యవర్తుల ద్వారా అప్పలనాయుడు వద్ద 30 సెంట్లు కొనుగోలు చేశారు. అప్పలనాయుడు నకిలీ పత్రాలతో ఆ భూమిని తనదిగా చూపించి, విడతల వారీగా లక్ష్మి నుంచి రూ.97 లక్షలు తీసుకున్నాడు. భూమి రిజిస్ట్రేషన్ చేయమని కోరితే మాయమాటలు చెప్పి, తప్పించుకుంటూ వచ్చాడు. చివరికి ఆమెపై దాడికి పాల్పడడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. విచారణ జరిపిన పోలీసులు నేరం రుజువు కావడంతో అప్పలనాయుడు, అతని భార్య శ్రీదేవి, కుమారుడు దినేష్, అతని అక్క సుంకరి అప్పలరాముపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అప్పలనాయుడు, శ్రీదేవిని కోర్టులో హాజరుపరచగా వారికి జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారు. దినేష్, సుంకరి అప్పలరామును స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. కేసును ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

యోగా దినోత్సవానికి పక్కాగా రవాణా ఏర్పాట్లు

» ప్రజల తరలింపునకు అధికారుల సమన్వయం ముఖ్యం

» రవాణా నోడల్ అధికారి మల్లికార్జున్ ఆదేశం

మహారాణిపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా వేడుకల్లో లక్ష్యానికి అనుగుణంగా ప్రజలు భాగస్వాములయ్యేలా చర్యలు చేపట్టాలని, ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని రాష్ట్ర బి.సి. సంక్షేమ శాఖ డైరెక్టర్, యోగా ఉత్సవాల రవాణా సన్నాహక నోడల్ అధికారి డాక్టర్ మల్లికార్జున్ అధికారులకు సూచించారు. యోగా డే ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు శనివారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తదితరులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక ప్రమాణాలు పాటిస్తూ బీచ్‌రోడ్డులో ఎంతమంది యోగా విన్యాసాల్లో పాల్గొనగలరు? అదనపు వేదికలపై ఎంతమంది ఆసీనులు కాగలరు అనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రతీ 24 చదరపు అడుగులకు ఒకరు చొప్పున యోగాసనాలు వేసేందుకు అనువుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. యోగాలో పాల్గొనదలచిన ఔత్సాహికులను తీసుకురావడానికి వాహనాల నిర్వహణలో పక్కాగా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంపార్టుమెంట్ల వారీగా బస్సులు కేటాయించి, వాటికి పార్కింగ్ వసతి కల్పించాలని కోరారు. వాహనాల రాకపోకల విషయంలో ఎలాంటి గందరగోళం తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించి యోగా డేను విజయవంతం చేయాలని మల్లికార్జున్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జీవీఎంసీ, ఏపీఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మల్లికార్జున్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తదితరులు

నేడు తొట్లకొండలో యోగాంధ్ర వేడుకలు

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం తొట్లకొండపై జిల్లా యంత్రాంగం ఆదివారం యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 6.30 నుంచి 40 నిమిషాలపాటు ప్రోటోకాల్ యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వివిధ శాఖల అధికారులు, యోగాభ్యాసకులు, స్వయం సహాయ సంఘాల సభ్యులు పాల్గొంటారు. తొట్లకొండలో ఆయుష్ ఆర్డీడీ ఝాన్సీలక్ష్మి, జిల్లా టూరిజం అధికారి మాధవి తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

సీఎంఆర్ మాల్‌లో చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం


సీఎంఆర్ సంస్థ డైరెక్టర్ మావూరి మోహన్‌బాలాజీ నుంచి బహుమతి అందుకుంటున్న విజేతలు

గాజువాక, మే 31 (ఆంధ్రజ్యోతి): గాజువాక సీఎంఆర్ సెంట్రల్ మాల్‌లోని మూడు, నాలుగో అంతస్తులలో గల గేమింగ్ జోన్ 2వ వార్షికోత్సవం సందర్భంగా 14 ఏళ్ల లోపు బాలబాలికలకు డిస్నీ, దేశభక్తి విభాగాల్లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిగా రూ.పది వేలు గిఫ్ట్ ఓచర్ (సిగలపల్లి పూజిత క్షర), ద్వితీయ బహుమతిగా రూ.ఐదు వేల గిఫ్ట్ ఓచర్ (కంటుమంచు నిఖిత) లకు సీఎంఆర్ సంస్థ డైరెక్టర్ మావూరి మోహన్‌బాలాజీ అందజేశారు. అనంతరం సెంట్రల్ మాల్ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ మూడు, నాలుగో అంతస్తుల్లో దాదాపు ఐదు వేల చదరపు అడుగుల్లో అన్ని వయస్సుల వారికి అలరించే అత్యాధునిక గేమ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దీంతో ఇక్కడ మంచి ఎంటర్‌టైన్‌మెంట్ లభిస్తుందన్నారు.

సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ


సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా మూడేళ్ల పదవీ కాలానికి బి. సత్యనారాయణ రెండోసారి నియమితులయ్యారు. ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ ఎండీ పృథ్వీ తేజ్ ఉత్తర్వులు జారీచేశారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ మొదటిసారి ఎంతో నిబద్ధతతో సేవలందించి విద్యుత్ వినియోగదారులకు అనుకూలంగా తీర్పులిచ్చారు. అధికారులు ఆయనను అభినందించారు.

రైల్వేలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వేలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ, హౌస్ కీపింగ్ విభాగం సిబ్బంది శనివారం డివిజన్ పరిధిలోని వివిధ స్టేషన్లలో ఎన్‌జీఓ, ప్రజలను భాగస్వాములను చేసి అవగాహన కల్పించారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిషేధించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌తో కలిగే హాని, పర్యావరణ పరిరక్షణ లాభాలు తెలుపుతూ వివిధ స్టేషన్లలో సాంస్కృతిక విభాగం కళాకారులు వీధి నాటకం ప్రదర్శించారు.